


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

04.08.2026

మంగళవారం | రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 35

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# నిమ్స్‌కు అరుదైన ఘనత

- 1000 రొబోటిక్ సర్జరీలు పూర్తి
- 90 శాతం ఫ్రీ.. సీఎం రేవంత్ ప్రశంసలు
- రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ సర్జరీలు
- వైద్య బృందానికి అభినందన
- ప్రభుత్వ వైద్యరంగంలో చారిత్రక మైలురాయి



**హైదరాబాద్, ఆగస్టు 03, అనంతజనశక్తి న్యూస్**
తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో నిమ్స్ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కేవలం రెండున్నరేళ్లలోనే 1000 రొబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమ్స్ వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘనత తెలంగాణలో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి రొబోటిక్ సర్జరీలను సాధారణ ప్రజలకు అందించడం ప్రజారోగ్య రంగంలో ఒక కీలక మలుపుగా అభివర్ణించారు.

ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవ రాజ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సహా అన్ని విభాగాలను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నిమ్స్‌లో నిర్వహించిన మొత్తం 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సల్లో 590 యూరాలజీ.. 248 సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ.. 162 సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో జరిగాయి. మూత్రపిండాలు, జీర్ణాశయం, కాలేయం, ప్యాంక్రియాస్, కొలొరెక్టల్, గైనకాలజీ, క్యాన్సర్ సంబంధిత క్లిష్ట శస్త్రచికిత్సలను రొబోటిక్ టెక్నాలజీతో విజయవంతంగా నిర్వహించారు. రొబోటిక్ సర్జరీల వల్ల శస్త్రచికిత్సల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు రక్తస్రావం, శస్త్రచికిత్స అనంతర నొప్పి తగ్గుతుందని, ఆస్పత్రిలో ఉండే రోజుల సంఖ్య తగ్గి రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అత్యంత విశేషమైన విషయం ఏమిటంటే.. ఈ 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. 2లో..

# బిహార్‌లో అధికార ఎన్డీయే కూటమికి భారీ షాక్

- బంకీపూర్‌లో జేఎస్పీ జెండా ఎగిరింది
- బంకీపూర్‌లో గెలుపుపై పీకే సంచలన వ్యాఖ్యలు
- నితిన్ నబీన్ రాజీనామా చేయడంతో ఉప-ఎన్నిక


2లో..

# అభివృద్ధికి అడ్డంకిగా వ్యవహరిస్తున్నారు

- యువతను రౌడీయిజం వైపు ప్రోత్సహిస్తున్నారు..!
- ప్రతిపక్ష వైసీపీ ప్రజాసేవ కంటే అరాచకాలు
- అలజడి సృష్టించడానికే ప్రాధాన్యం ఇస్తోంది
- మంత్రి పార్థసారధి కామెంట్

2లో..

**అమరావతి, ఆగస్టు 03, అనంతజనశక్తి న్యూస్**
రాష్ట్రంలో ప్రతిపక్ష వైసీపీ ప్రజాసేవ కంటే అరాచకాలు, అలజడి సృష్టించడానికే ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మంత్రి పార్థసారధి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అహర్నిశలు దృష్టి సారిస్తుంటే, వైసీపీ మాత్రం యువతను రౌడీయిజం వైపు ప్రోత్సహిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రజలు వైసీపీ తీరును గమనిస్తున్నారని, ఆ పార్టీని రాజకీయంగా తిరస్కరించాలని భావిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.



# ‘గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ’ పనుల్లో వేగం పెంచండి

- తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ
- కోతల నివారణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలు
- ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను.. 2లో..
- వచ్చే రెండు నెలల్లో పూర్తిచేసేలా చూడాలి




**అమరావతి, ఆగస్టు 03, అనంత జనశక్తి న్యూస్**
తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం మరింత పెరగాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను వచ్చే రెండు నెలల్లో పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.

# మ్యాపింగ్ కాని వారికి నోటీసులు!

- ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ]
- కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా

2లో..



# రేవంత్ సర్కార్‌పై సంజయ్ ఫైర్

- బోనాలకు రూ.20 కోట్లేనా?
- జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలి
- భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆగ్రహం



**హైదరాబాద్, ఆగస్టు 03, అనంతజనశక్తి న్యూస్** 2లో..
తెలంగాణలో పండుగలకు నిధులు కేటాయించడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఉద్దేశించి.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రంజాన్ పండుగ నిర్వహణకు రూ.33 కోట్లు కేటాయించిన రేవంత్ రెడ్డి సర్కార్.. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బోనాల ఉత్సవాలకు కేవలం రూ.20 కోట్లు మాత్రమే ఇవ్వడం సరైందేనా అని ప్రశ్నించారు.

# జోగినిలకు ప్రత్యేక గుర్తింపు

- కార్డులు జారీ చేస్తాం!: మంత్రి పొన్నం
- భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు రావు
- ఆ దిశగా ప్రభుత్వం పని చేస్తది 2లో..



**హైదరాబాద్, ఆగస్టు 03, అనంత జనశక్తి న్యూస్**
లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# నిమ్స్‌కు అరుదైన ఘనత

- 1000 రొబోటిక్ సర్జరీలు పూర్తి
- 90 శాతం ఫ్రీ.. సీఎం రేవంత్ ప్రశంసలు
- రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ సర్జరీలు



2లో..

# రైతుల గురించి మాట్లాడే హక్కు లేదు

- మంత్రి అచ్చెన్నాయుడు
- పొగాకు రైతులను ఆదుకోలేని జగన్‌కు..
- జగన్ హయాంలో రైతులు కష్టాల్లో ఉంటే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించింది
- కూటమి ప్రభుత్వం రైతులకు భరోసాగా నిలిచింది 2లో..



**అమరావతి, ఆగస్టు 3: అనంత జనశక్తి న్యూస్**
రైతుల సంక్షేమం విషయంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పుడు రైతులపై ప్రేమ ఉన్నట్టుగా మాట్లాడటం జగన్ మోహన్ రెడ్డికి ఏమాత్రం తగదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఐదేళ్ల పాలనలో పొగాకు రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినా వారికి అండగా నిలవడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని అన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 12.93 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుతో చేతులు దులుపుకుని రైతులను మార్కెట్ కరుణకే వదిలేసిందని మండిపడ్డారు.

# అన్ని విమర్శలకు త్వరలో సమాధానం ఇస్తా

- సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే
- అమెరికా ఎడ్యుకేషన్ ఫండింగ్‌లపై విమర్శలు 2లో..
- బోస్టన్ యూనివర్సిటీ ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో చదువు పూర్తి



**న్యూఢిల్లీ, ఆగస్టు 03, అనంతజనశక్తి న్యూస్**
ఢిల్లీ ఉద్యమం తర్వాత సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కేపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అమెరికా ఎడ్యుకేషన్ ఫండింగ్‌లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఒక ఇంటర్వ్యూలో అభిజీత్ దీప్కే క్లారిటీ ఇచ్చారు. అన్ని విమర్శలకు త్వరలో సమాధానం ఇస్తానని తెలిపారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | రంగారెడ్డి
04.08.2026


# అభివృద్ధికి అడ్డంకిగా వ్యవహరిస్తున్నారు



(మొదటి పేజీ తరువాయి)

వైసీపీలో ప్రజలకు సేవ చేయడం కంటే అరాచకాలు చేయడానికే ప్రాధాన్యం ఉన్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. పార్టీ అధినేత దృష్టిని ఆకర్షించాలంటే విధ్వంసం, అలజడి, సమాజంలో చీలికలు సృష్టించే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.
వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలపై పూర్తి వాస్తవాలు బయటకు రాకముందే రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పార్థసారథి విమర్శించారు. ఇటువంటి రాజకీయ డ్రామాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థంగా తిప్పికొడతారని ఆయన అన్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావించిన మంత్రి, ఇప్పుడు కర్నూలు జిల్లాలోనూ అలాంటి పరిస్థితులు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆలూరు ప్రాంతంలో బలహీన వర్గాలపై దౌర్జన్యాలు జరిగాయని, దళితులపై దాడులు జరిగాయని కూడా ఆయన ఆరోపించారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆయురారోగ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపడుతుంటే, ప్రతిపక్ష నాయకుడు జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన మానసిక ధోరణిని ప్రతిబింబిస్తున్నాయని మంత్రి అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం సహించదని, చట్టం తన పని తాను చేసుకుంటుందని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

# రైతుల గురించి మాట్లాడే హక్కు లేదు

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు శాశ్వత ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవడంలో, మార్కెట్‌లో సమర్థవంతంగా జోక్యం చేసుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పొగాకు రైతుల సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని కార్యాచరణ ప్రారంభించిందని మంత్రి తెలిపారు. గత ఏడాదిలోనే సుమారు 25 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును రూ.270 కోట్ల విలువతో కొనుగోలు చేసి వేలాది మంది రైతులకు అండగా నిలిచామని చెప్పారు. అలాగే ఎఫ్‌సీవీ (వర్జీనియా) పొగాకు రైతులను ఆదుకునేందుకు లో, ఆఫ్ స్టైల్ రకాల పొగాకుకు కిలోకు రూ.10ల ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. సుమారు 100 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే కేంద్ర కార్యాచరణ కొనసాగుతోందన్నారు. రైతులకు మార్కెట్ భరోసాతో పాటు ఆర్థిక తోడ్పాటు కూడా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని సాధించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY) కింద అన్ని ఖరీఫ్ పంటలకు పంటల బీమా నమోదు, ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించేలా కేంద్ర వ్యవసాయ శాఖ, బీమా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా చర్చలు జరిపిందన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో ఈ నిర్ణయం సాధ్యమైందని చెప్పారు.ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, ఇతర అనివార్య పరిస్థితుల వల్ల కలిగే పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో పంటల బీమా కీలక రక్షణగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల రుణ గ్రహీతలు, రుణేతర రైతులు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్క రైతు కూడా ఇన్సూరెన్స్ కట్టుకోవాలని , అతి తక్కువ ప్రీమియం ధరను రైతులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వ్యవసాయ అధికారులు రైతులకు పూర్తి అవగాహన కల్పించి, ఇన్సూరెన్స్ కట్టించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు ఆగస్టు 15లోపు పంటల బీమాలో నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రైతుల కష్టసుఖాలు తెలియని వారు ఇప్పుడు రైతు ప్రేమ గురించి మాట్లాడటం విడ్డూరమని, మాటలతో కాదు... చేతలతో రైతులకు అండగా నిలవడం కూటమి ప్రభుత్వ నిబద్ధత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# జోగినిలకు ప్రత్యేక గుర్తింపు

హైదరాబాద్, ఆగస్టు 03, అనంత జనశక్తి న్యూస్




జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కోఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్

# రేవంత్ సర్కార్‌పై సంజయ్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడిన బండి సంజయ్.. తెలంగాణలో హిందూ పండుగలు, ఉత్సవాల నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. జంట నగరాల్లో 3 వేలకుపైగా ఆలయాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారని.. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు ఏ మాత్రం సరిపోవని అన్నారు.
బోనాలను
రాష్ట్ర పండుగగా ప్రకటించినప్పటికీ.. అందుకు తగిన స్థాయిలో నిధులు ఇవ్వడం లేదని బండి సంజయ్ విమర్శించారు. రంజాన్‌కు రూ.33 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. రాష్ట్ర జనాభాలో 80 శాతానికి పైగా ఉన్న హిందువులు నిర్వహించే బోనాల ఉత్సవాలకు రూ.20 కోట్లు మాత్రమే ఇవ్వడం వివక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని బండి సంజయ్ ఆరోపించారు. మండుటెండలో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడుతున్న భక్తులకు తాగునీటి వంటి సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు కేవలం ఆలయ దర్శనాలు చేయడం కాకుండా భక్తుల సమస్యలను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై కూడా బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అని సీఎం రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. అదే కారణంగా హిందూ పండుగల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా బోనాల ఉత్సవాలకు తగిన నిధులు కేటాయించలేదని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సహా అన్ని హిందూ పండుగలకు జనాభా నిష్పత్తి ప్రాతిపదికన నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ డిమాండ్ చేశారు. హిందువులు కూడా తమ పండుగల నిర్వహణలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# నిమ్స్‌కు అరుదైన ఘనత

(మొదటి పేజీ తరువాయి)

**ఇటీవలే 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్ ఆస్పత్రి.. ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం మరో చారిత్రక విజయమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను కూడా నిమ్స్ విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గుర్తు చేశారు. కొత్త టిమ్స్ ఆస్పత్రులు, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో కూడా రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారానే ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.**

## 30 ఏళ్ల కోట 30 రోజుల్లోనే కూలిపోయింది

# బిహార్‌లో అధికార ఎన్డీయే కూటమికి భారీ షాక్

;బంకీపూర్, ఆగస్టు 03, అనంత జనశక్తి న్యూస్

బిహార్‌లోని బంకీపూర్ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల్లో జన్ సూరజ్ పార్టీ అధినేత విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై ఆయన దాదాపు 20 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బీజేపీకి కంచుకోట లాంటి ఈ స్థానంలో పీకే విజయంతో అధికార పార్టీ ఖంగుతింది. 1995 నుంచి ఇక్కడ వరుసగా బీజేపీ జెండా ఎగురుతూ వస్తోంది. కానీ, ఉపఎన్నికలో ఆ పార్టీకి ఓటర్లు షాకిచ్చారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన విజయం బీజేపీ హైకమాండ్‌కు ఓ సందేశమని పేర్కొన్నారు. అంతేకాదు, '30 ఏళ్ల కోట 30 రోజుల్లో కూలిపోయింది' అని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వరుసగా ఐదుసార్లు ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉపఎన్నిక అనివార్యమైంది. విద్య, ఉపాధిపై దృష్టి సారించే మంచి నాయకత్వం బిహార్‌కు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. తనకు ఓటు వేసినవారికి ధన్యవాదాలు తెలుపుతూ "ప్రజలు ఈ సందేశాన్ని ఇచ్చారు" అని కిషోర్ అన్నారు. రాష్ట్రం నుంచి వలసలను ఆపడానికి బిహార్ నాయకత్వం కృషి చేయాలని చెబుతూ... తనకు మద్దతు ఇవ్వని వారిని కూడా తనవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తానని ఆయన తెలిపారు. అంతేకాదు, నేరచరిత్ర ఉన్న వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేశారని ఆయన ఆరోపించారు.
"ఇది ఒక ఎమ్మెల్యేను గెలిపించే ఎన్నిక కాదు. బిహార్‌లో విద్య, ఉపాధి కల్పించాలంటే ఒక మంచి వ్యక్తిని ముఖ్యమంత్రిని చేయాలనే సందేశాన్ని బీజేపీ అగ్ర నాయకత్వానికి పంపే ఎన్నిక ఇది. ఈ సందేశాన్ని ప్రజలు ఇచ్చారు. నాకు ఓటు వేసిన ప్రజలకు నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. ఓటు వేయని వారిని నా వైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తాను. కానీ ముఖ్యమైన విషయం ఏమిటంటే, బిహార్‌కు మంచి నాయకత్వం లభించాలి. ఇక్కడి నుంచి వలసలు ఆగిపోవాలి" అని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు.

# మ్యాపింగ్ కాని వారికి నోటీసులు!

అమరావతి, ఆగస్టు 03, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తయ్యింది. ఓటర్ల ముసాయిదా జాబితాను కూడా ఎన్నికల సంఘం అధికారులు ఇటీవల విడుదల చేశారు. ఈ జాబితాలను అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శిస్తున్నారు. అలాగే మ్యాపింగ్ కాని ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేసే పనిలో ఉన్నారు. ఎన్నికల సంఘం గైడ్ లైన్స్‌కు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఈ చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 2002 జాబితాలో ఉన్న ఓటర్లు, ఆ తర్వాతి కాలంలో జాబితాలో చేరినవారు.. తమ పూర్వీకుల వివరాలతో సరిపోల్చాల్సి ఉంటుంది. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న వారిలో కొంతమంది తమ పూర్వీకుల వివరాలను సరిగా చెప్పలేదని తెలిసింది. అలాగే అప్పట్లో పేర్లను తప్పుగా నమోదు చేయడం వంటి కారణాలతో..ఓటర్ల మ్యాపింగ్‌లో ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు చెప్తున్నారు. దీంతో చాలా మంది ఓటర్ల వివరాలు పెండింగ్‌లో పడిపోయాయి. ఇలా మ్యాపింగ్ కాని ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. మ్యాపింగ్ కాని వారితో పాటుగా.. అలాగే వివరాలు తప్పుగా ఇచ్చినవారికి కూడా అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. వీరంతా కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధ్రువపత్రాలలో ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఆగస్ట్ 30వ తేదీ వరకూ ఇందుకు అవకాశం ఉందని.. ఈలోపే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.మరోవైప ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మూడు కోట్ల 71 లక్షల మంది ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించినట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఇటీవల వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో 89.22 శాతం మంది ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని తమ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించినట్లు వెల్లడించారు. ఓటరు లిస్టులోని 15.22 లక్షల మందిని చనిపోయినట్లు గుర్తించామని.. 22.30 లక్షల మంది ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనకపోవడమో.. శాశ్వతంగా నివాసాలు మారడమో జరిగిందన్నారు. ఇక రాష్ట్రంలోని 7.37 లక్షల మంది ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటర్లుగా నమోదైనట్లు ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఇటీవలి కాలంలో వెల్లడించారు.

## - ప్రభుత్వ వైద్యరంగంలో చారిత్రక మైలురాయి

# నిమ్స్‌కు అరుదైన ఘనత వైద్య బృందానికి అభినందన

హైదరాబాల్, ఆగస్టు 03, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో నిమ్స్ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కేవలం రెండున్నరేళ్లలోనే 1000 రొబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమ్స్ వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘనత తెలంగాణలో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి రొబోటిక్ సర్జరీలను సాధారణ ప్రజలకు అందించడం ప్రజారోగ్య రంగంలో ఒక కీలక మలుపుగా అభివర్ణించారు.
ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సహా అన్ని విభాగాలను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నిమ్స్‌లో నిర్వహించిన మొత్తం 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సల్లో 590 యూరాలజీ.. 248 సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ.. 162 సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో జరిగాయి. మూత్రపిండాలు, జీర్ణాశయం, కాలేయం, ప్యాంక్రియాస్, కొలొరెక్టల్, గైనకాలజీ, క్యాన్సర్ సంబంధిత క్లిష్ట శస్త్రచికిత్సలను రొబోటిక్ టెక్నాలజీతో విజయవంతంగా నిర్వహించారు. రొబోటిక్ సర్జరీల వల్ల శస్త్రచికిత్సల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు రక్తస్రావం, శస్త్రచికిత్స అనంతర నొప్పి తగ్గుతుందని, ఆస్పత్రిలో ఉండే రోజుల సంఖ్య తగ్గి రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అత్యంత విశేషమైన విషయం ఏమిటంటే.. ఈ 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇటీవలే 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్ ఆస్పత్రి.. ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం మరో చారిత్రక విజయమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను కూడా నిమ్స్ విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గుర్తు చేశారు. కొత్త టిమ్స్ ఆస్పత్రులు, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో కూడా రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారానే ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# అన్ని విమర్శలకు త్వరలో సమాధానం ఇస్తా

(మొదటిపేజీ తరువాయి)

ఇక అమెరికా ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన అన్ని వివరాలు వెల్లడిస్తానని పేర్కొన్నారు. బోస్టన్ యూనివర్సిటీ ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో పాటు విద్యా రుణం ద్వారా చదువు పూర్తి చేసినట్లు స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం విద్యా రుణాన్ని తీర్చుతున్నట్లు వెల్లడించారు. సీజేపీ పేరుతో కొనసాగుతున్న ఉద్యమాన్ని రాజకీయ పార్టీగా మార్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం తగ్గిపోతున్న నేపథ్యంలో మరో రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం కంటే విస్తృత ప్రజా ఉద్యమం అవసరమని అన్నారు. అయితే తమ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరోసారి ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.
"మాకు అలాంటి ఉద్దేశం లేదు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించి రాజకీయ పార్టీలను ఎలా చీల్చుతున్నారో చూస్తున్నాం. ఎన్నికల్లో ఓట్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రాజకీయ వ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్న సమయంలో.. మరో రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి మనం ఏం సాధిస్తాం?" అని దీప్కే ప్రశ్నించారు. ప్రజల్లో నమ్మకం తగ్గడం కేవలం రాజకీయ వ్యవస్థకే పరిమితం కాలేదన్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థతో పాటు మీడియాపై కూడా ప్రజల విశ్వాసం తగ్గుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి మరో రాజకీయ పార్టీ కంటే బలమైన ప్రజా ఉద్యమం అవసరమని అభిప్రాయపడ్డారు.

సీజేపీ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరోసారి నిరసన చేపడతామని అభిజీత్ దీప్కే హెచ్చరించారు. నీట్ యూజీ పరీక్షకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించాలన్న డిమాండ్ ఇప్పటికీ నెరవేరలేదని ఆరోపించారు. "ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను అమలు చేయాలని మేం కోరుతున్నాం. అలా చేయకపోతే మళ్లీ ఆందోళనకు దిగాల్సి ఉంటుంది" అని హెచ్చరించారు. పరిహారం అంశాన్ని పరిశీలించే సమయంలో ప్రభుత్వం నిబంధనలు, నియమావళిని ప్రస్తావిస్తోందని విమర్శించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారని.. కానీ బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాల్సి వచ్చినప్పుడు మాత్రం ముందుగా నిబంధనలు పరిశీలిస్తారని ఆరోపించారు.
ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ 37 రోజుల పాటు నిర్వహించిన నిరసనలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలనే డిమాండ్ ప్రధానంగా ఉంది. అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలని కూడా ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత.. తమ ఇతర డిమాండ్లపై కూడా ప్రభుత్వం నుంచి హామీలు లభించాయని పేర్కొంటూ సీజేపీ జూలై 25న తన ఆందోళనను ముగించింది. అయితే కొత్త కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని నియమించడాన్ని తమ సంస్థ వ్యతిరేకిస్తోందని అభిజీత్ దీప్కే తెలిపారు. "కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న మా డిమాండ్ నెరవేరింది. కానీ ఆయన స్థానంలో ఎవరిని విద్యాశాఖ మంత్రిగా నియమించారు? ప్రహ్లాద్ జోషిని నియమించారు. ఈ నిర్ణయానికి మేం మద్దతు ఇవ్వడం లేదు" అని అన్నారు. నిరసన సందర్భంగా జూలై 20న చోటుచేసుకున్న హింస ముందస్తు ప్రణాళికతో జరిగిందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఉద్యమాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులతో ఢిల్లీ పోలీసులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచే నిరసనలో గందరగోళం సృష్టించేందుకు బయట వ్యక్తులను పంపించే అవకాశం ఉందని తాను హెచ్చరిస్తూ వచ్చానని దీప్కే పేర్కొన్నారు. ఆ తర్వాత జరిగిన ఘటనలకు సీజేపీ సభ్యులే కారణమని ఆరోపించే ప్రయత్నం జరుగుతుందని ముందే చెప్పానన్నారు. జూలై 20న జరిగిన ఘటనకు ఒక రోజు ముందు జంతర్‌మంతర్‌లోని వేదిక వెనుక రాళ్లతో నిండిన ట్రక్కును ఢిల్లీ పోలీసులు నిలిపారని ఆరోపించారు. అక్కడ ముందుగానే దెబ్బతిన్న వ్యాన్‌ను కూడా పార్క్ చేశారని తెలిపారు. మరుసటి రోజు నిరసనలో రాళ్ల దాడి జరిగినట్లు వార్తలు రావడం వెనుక ముందస్తు ప్రణాళిక ఉందని ఆరోపించారు. "జూలై 19న జంతర్‌మంతర్‌లోని వేదిక వెనుక రాళ్లతో నిండిన ట్రక్కును ఢిల్లీ పోలీసులు ఎందుకు నిలిపారు? జూలై 20కు ముందే అక్కడ దెబ్బతిన్న వ్యాన్‌ను ఎందుకు పార్క్ చేశారు? మరుసటి రోజు నిరసనలో రాళ్ల దాడి జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటనను ఢిల్లీ పోలీసులు ముందే ప్రణాళిక చేసినట్లు కనిపిస్తోంది" అని దీప్కే ఆరోపించారు.

# డేటా ఆధారిత పాలనకే ప్రాధాన్యం ఇవ్వాలి

అమరావతి, ఆగస్టు 03, అనంత జనశక్తి న్యూస్

అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్టీజీఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు ఈరోజు (సోమవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు సీఎం మార్గనిర్దేశం చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్టీజీ ద్వారా పాలన మరింత సమర్థవంతంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం 5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి**

ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తాగునీటి ఎద్దడి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు కృష్ణా, గోదావరి నదుల నీటి పరిస్థితిని సీఎంకు వివరించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, ఇటీవల కృష్ణా నదిలో ప్రవాహాలు ప్రారంభమైనట్లు తెలిపారు. గోదావరిలోని వరద పరిస్థితిపైనా సీఎంకు వివరించారు. కృష్ణా బేసిన్‌కు ఎగువ నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్షాభావం కారణంగా రానున్న రోజుల్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశమున్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతపై తరచూ పరీక్షలు నిర్వహించి, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అనవసర నిబంధనల తొలగింపుపై అధికారులు సీఎంకు వివరించారు.

# 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ' పనుల్లో వేగం పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

**గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దేశించిన లక్ష్యాలు ఎంత వరకు పూర్తి చేశారు? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారు? ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు? తదితర వివరాలను అంశాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్యసాధనలో భాగంగా గత రెండేళ్లలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిన అంశాన్ని పవన్ గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.**

# మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసు.. నిర్దోషిగా బ్రిజ్‌భూషణ్



మహిళా రెజ్లర్లను లైంగిక వేధించినట్లు ఆరోపణలు వచ్చిన కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌నిర్దోషిగా తేలారు. ఆయనతో పాటు మరో నిందితుడు వినోద్ తోమర్‌ను దిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు సోమవారం నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది. 20162019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ , ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనంవైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (IOC) కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మూడు నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంతకాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు.

అంతకుముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు. ఇక నేటి తీర్పుతో ఆయనపై క్రిమినల్ విచారణ ముగిసినట్లయింది.

తొలినుంచి బ్రిజ్ భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ''ఆ ఆరోపణలు నిజమని తేలితే.. నేను ఉరివేసుకుంటానని తొలిరోజే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా తేలినందుకు ఎంతోసంతోషంగా ఉంది'' అని తీర్పు అనంతరం సింగ్ వ్యాఖ్యానించారు.

స్పందించిన వినేశ్ ఫొగాట్..

''అధికార పార్టీకి చెందిన ఒక శక్తిమంతమైన నాయకుడిపై ఫిర్యాదు చేయడానికి, వీధుల్లోకి వచ్చి నిరసన తెలపడానికి మేం ఎంతో ధైర్యం కూడగట్టుకోవాల్సి వచ్చింది. కానీ, తన పలుకుబడిని ఉపయోగించుకొని ఆ అమ్మాయిలు కేసులు ఉపసంహరించుకునేలా చేశారు. అయినా సరే పలువురు మహిళా రెజ్లర్లు తమ పోరాటాన్ని కొనసాగించారు. ఇప్పుడు బ్రిజ్‌భూషణ్ నిర్దోషిగా తేలడం తీవ్ర నిరాశకు గురిచేసింది. దీనిపై మేం అప్పీల్ చేస్తాం. మా పోరాటాన్ని కొనసాగిస్తాం. మా ఆశను కోల్పోలేదు'' అని వినేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం



జార్ఖండ్‌లో మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలు నుంచి ధన్‌బాద్‌కు తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మార్గమధ్యలో సుజిత్ మరుగుదొడ్డికి వెళ్లాలని కోరడంతో పోలీసులు వాహనం ఆపారు. అదే అదనుగా భావించిన అతడు ఓ పోలీసు వద్ద ఉన్న రైఫిల్‌ను లాక్కొని చీకట్లోకి పరుగెత్తాడు. ఈ క్రమంలో అతడు పోలీసులపై కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు చేపట్టగా.. అతడు తీవ్ర గాయాలపాలైనట్లు వెల్లడించారు. వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఘటన అనంతరం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఉన్నతాధికారులు అక్కడికి చేరుకుని ఘటనపై సమీక్ష నిర్వహించారు. సుజిత్ సిన్హాపై హత్యలు, వసూళ్లు, ఇతర నేరాలకు సంబంధించిన అనేక కేసులు నమోదై ఉన్నాయి. చాలాకాలంగా అతడు జార్ఖండ్ పోలీసుల మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు.

# భాజపాకు ప్రశాంత్ కిశోర్ షాక్.. కమలం కంచుకోటలో విజయబావుటా

ఎన్నికల ప్రచార వ్యూహకర్త, జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ భాజపాకు షాక్ ఇచ్చారు. బిహార్‌లో కమలం పార్టీ కంచుకోటైన బాంకీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి అనూహ్య విజయం సాధించారు. తొలి రౌండ్ నుంచి ఆధిక్యం ప్రదర్శించిన ఆయన భాజపా అభ్యర్థి నీరజ్ కుమార్‌పై 18,964 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు అడ్డాగా పేరొందిన ఈ నియోజకవర్గంలో దాదాపు 30 ఏళ్ల తర్వాత భాజపా ఓటమిపాలవ్వడం గమనార్హం.

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి గెలుపొందిన నితిన్ నబీన్ భాజపా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే, ఆయన రాజ్యసభకు కూడా నామినేట్ కావడంతో తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాల్సి రావడంతో బాంకీపుర్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో జులై 30న ఉపఎన్నిక నిర్వహించగా.. తాజాగా ఓట్ల లెక్కింపు చేపట్టగా భాజపా కంచుకోటలో ప్రశాంత్ కిశోర్ విజయం బావుటా ఎగురవేశారు.



**వ్యూహాలకు పదునుపెట్టి.. ప్రజలతో మమేకమై..**

ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ పార్టీని స్థాపించిన ప్రశాంత్ కిశోర్ బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు. తాను పోటీ చేయకపోయినప్పటికీ తన పార్టీ జన్ సురాజ్ తరపున పోటీ చేసిన ఒక్క అభ్యర్థినీ గెలిపించుకోలేకపోయారు. 243 స్థానాలకు గానూ 238 సీట్లలో ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేసినప్పటికీ ఒక్క సీటులోనూ సత్తా చాటలేకపోయారు. దీంతో అప్పట్లో ఓటమికి బాధ్యత వహిస్తూ పీకే మౌనవ్రతం కూడా చేశారు.

ఈ క్రమంలో తాజాగా బాంకీపుర్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ రాగానే.. ఆయనే సొంతంగా బరిలోకి దిగారు. భాజపా నిలబెట్టిన నీరజ్ కుమార్‌కు ఆ స్థాయి ప్రజాదరణ లేకపోవడం పీకేకు కలిసొచ్చిందనే చెప్పాలి. అలాగే, భాజపా కంచుకోటలో ఓటర్లు మార్పు కోరుకోవడం కూడా పీకే గెలుపునకు కారణమనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నిక బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ పై ప్రజాభిప్రాయ సేకరణ అని తన ప్రచారంలో భాగంగా పీకే పలుమార్లు అభివర్ణించారు.

ఇటు భాజపా, అటు ప్రధాన ప్రతిపక్షమైన ఆర్జేడీ ఓటర్ బేస్‌లో చీలిక కూడా ప్రశాంత్ కిశోర్‌కు బాగా ఉపయోగపడిందని సమాచారం. అగ్రవర్ణాల్లోని కొన్ని సెక్షన్లు, ముస్లింయాదవ్ ఓటర్లలోని కొందరు ఆయన వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. భాజపాకు వ్యతిరేకంగా ప్రశాంత్‌కు గెలిచే సామర్థ్యం ఉందని గ్రహించిన ముస్లిం ఓటర్లు ఆయనవైపు మొగ్గుచూపారనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. అలాగే, తన ఎన్నికల ప్రచారంలో కులం, మతం వంటి అంశాలను గాకుండా ప్రజాసమస్యలను లేవనెత్తడం ఓటర్లను ఆకట్టుకుంది. భాజపా మాత్రం ఈ ప్రాంతంతో నబీన్‌కు ఉన్న అనుబంధం ఆధారంగా ఓటేయమని కోరింది. స్వతహాగా వ్యూహకర్త అయిన ప్రశాంత్ కిశోర్ తన వ్యూహాలకు మరింత పదును పెట్టారు. ప్రజలతో మమేకమవ్వడానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో అధికార పార్టీలో ఉన్న విభేదాలు తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలీకృతమైన పీకే.. భాజపా కంచుకోటలో విజయం సాధించారు.

**మంజల్‌పూర్‌లో భాజపా అభ్యర్థి విజయం**

మరోవైపు, గుజరాత్‌లోని మంజల్‌పూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థి సతీశ్ పటేల్ విజయం సాధించారు. కాంగ్రెస్ తరపున బరిలోకి దిగిన బికాభాయ్ రబారీపై 30 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. భాజపా ఎమ్మెల్యే యోగేశ్ పటేల్ ఆకస్మిక మరణంతో ఆ స్థానం ఖాళీ కాగా.. తాజాగా ఉప ఎన్నిక నిర్వహించారు. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 182 స్థానాలకు గానూ.. 156 చోట్ల భాజపా విజయం సాధించింది.

# రోడ్లపై పాదచారులు నడిచేందుకు దారివ్వండి: సుప్రీం కోర్టు



పాదచారులకు రోడ్లపై నడవడానికి సరైన మార్గం లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతుండడంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రహదారులు ఉన్న ప్రతిచోట పాదచారుల కోసం.. ఆక్రమణలు లేని స్థలాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాదచారులు నడిచే మార్గం.. మోటార్ వాహనాలు ప్రయాణించే మార్గానికి విడిగా ఉండాలని పేర్కొంది. విడిగా మార్గాన్ని ఏర్పాటు చేయడానికి వీలుకాని ప్రదేశాల్లో రోడ్లకు, ప్రజలు నడిచే ప్రదేశానికి మధ్య తాడు అయినా కట్టాలని సూచించింది.

రహదారుల పక్కన ఉండే ఖాళీ స్థలం తమ కోసమేనని.. వాహనాల బెడద లేకుండా స్వేచ్ఛగా నడవగలమని పాదచారులకు నమ్మకం కలిగించాలని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇందుకు రెండు వారాల గడువు ఇచ్చింది. అనంతరం పాదచారుల కోసం చేసిన ఏర్పాట్లపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. విషయాన్ని తదుపరి విచారణ కోసం రెండు వారాలకు వాయిదా వేసింది. ఫుట్‌పాత్‌లపై నడవడం కూడా ప్రజల ప్రాథమిక హక్కులలో భాగమని పేర్కొంది.

# ఉన్నత చదువులకు కుటుంబంపై ఆధారపడలేదు : అభిజీత్ దీప్కే

అమెరికాలో ఉన్నత విద్యకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయనే ఆరోపణలపై కాక్రోచ్ జనతా పార్టీ( వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. తన చదువులకు కుటుంబంపై ఆధారపడలేదని వివరించారు. బోస్టన్ యూనివర్సిటీ ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో పాటు విద్యా రుణం ద్వారా చదువు పూర్తి చేసినట్లు స్పష్టత ఇచ్చారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ''నాకు యూనివర్సిటీ నుంచి స్కాలర్‌షిప్ వచ్చింది. అలాగే విద్యా రుణం కూడా తీసుకున్నాను. దానిని ఇప్పుడు తిరిగి చెల్లిస్తున్నాను'' అని తెలిపారు. సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ ఇటీవల దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై విచారణ జరపాలని పలు సంస్థలను కోరిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీజేపీ నిధులపై వస్తున్న ప్రశ్నలకూ దీప్కే సమాధానమిచ్చారు. భవిష్యత్తులో క్రౌడ్ ఫండింగ్ ద్వారా ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తామన్నారు. ప్రతి రూపాయి లెక్కను పారదర్శకంగా వెల్లడిస్తామని చెప్పారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ సమయంలో ప్రజలే ఆహారం, తాగునీరు అందించి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. మరోవైపు సీజేపీ ప్రతినిధి వైష్ణవి గౌర్ ఆర్టీఐ కార్యకర్తపై విమర్శలు గుప్పించారు. వ్యక్తిగత విద్యా ఖర్చులపై ప్రశ్నలు లేవనెత్తేవారు.. ఇతర నిధుల దుర్వినియోగంపై ఎందుకు దృష్టి సారించడం లేదని మండిపడ్డారు.



**మా బాధ్యత ఇంకాస్త పెరిగింది..**

ఇటీవల నిరసనల తర్వాత తమ పార్టీపై బాధ్యత మరింత పెరిగిందని అభిజీత్ దీప్కే అన్నారు. ప్రజాసమస్యలను మరింత బలంగా ముందుకు తీసుకెళ్లేందుకు త్వరలోనే సీజేపీ బృందాన్ని విస్తరిస్తామని తెలిపారు. సోమవారం ఓ ఛానల్‌తో ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్నారని.. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. దేశంలో విద్య సామాన్య ప్రజలకు అందనంత ఖరీదుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, ఉపాధి వంటి అంశాలపై రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు.

# సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం



సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన 'సుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) చట్ట సవరణ బిల్లు2026' కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సీజేఐ సహా జడ్జీల సంఖ్య 34 నుంచి 38కి పెంచేందుకు ఈ బిల్లును రూపొందించారు. బిల్లుపై కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా విపక్ష సభ్యులు పదేపదే నినాదాలు చేశారు. కీలకమైన బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభ్యులను స్పీకర్ కోరారు. విపక్షాల నిరసనలతో బిల్లుపై చర్చించకుండానే స్పీకర్ ఆమోదించారు. అనంతరం సభను రేపటికి వాయిదా వేశారు.

సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంపు విషయంపై మే నెలలోనే కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దానిని కార్యరూపంలోకి తీసుకొస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ద సుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ ఆర్డినెన్స్2026'ను జారీ చేశారు. ఈ ఏడాది జారీ చేసిన తొలి ఆర్డినెన్స్ ఇదే. తాజా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఈ బిల్లు సభ ఆమోదం పొందింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 జనవరి 26వ తేదీన 8 మంది న్యాయమూర్తులతో ప్రారంభమైన సర్వోన్నత న్యాయస్థానం 76 ఏళ్లలో సంఖ్యాపరంగా 30కు, నిష్పత్తి ప్రకారం 375శాతం పెరిగినట్లయింది.

# అయోధ్య విరాళాల చోరీ అంశం.. విధుల నుంచి ఆర్ఎస్ఎస్ నేత తొలగింపు

అయోధ్య రామాలయం విరాళాల చోరీ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్రస్ట్ పోషకుడి బాధ్యతల్లో ఉన్న ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత భయ్యాజీ జోషిని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆ పదవి నుంచి తొలగించింది. విరాళాల చోరీ నేపథ్యంలో చేపట్టిన సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆయనను తొలగించినట్లు వెల్లడించింది. దీనిపై జోషి స్పందిస్తూ.. ఆరోగ్య సమస్యల కారణంగా తాను పదవి నుంచి తప్పుకొన్నట్లు తెలియజేశారు.

కొన్నేళ్ల క్రితం రామ జన్మభూమి ప్రాజెక్టుకు సంబంధించిన భూముల కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో భయ్యాజీ జోషిని ట్రస్ట్ పోషకుడిగా నియమించారు. ఆయన బహిరంగంగా పెద్దగా కనిపించనప్పటికీ.. ట్రస్ట్ తీసుకునే నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. జోషి 2009 నుంచి 2021 వరకు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.



**ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే.. రూ.80లక్షలు స్వాధీనం**

విరాళాల చోరీ అంశంపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకముందే.. సొమ్ము కాజేసిన నిందితుల నుంచి ఆలయ ట్రస్ట్ కొంత మొత్తంలో నగదు స్వాధీనం చేసుకుంది. ఈ విషయాన్ని ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు. విరాళాల దొంగతనంపై జరిపిన అంతర్గత తనిఖీల్లో సుమారు రూ.80లక్షల విలువైన నగదు, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరోవైపు ఆలయ ట్రస్ట్ పరిపాలనాపరమైన పనితీరుకు సంబంధించిన పలు అంశాలను పరిశీలించడానికి ఈ కేసులో మరో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# జంతర్‌మంతర్ వద్దు.. నిరసన వేదిక మార్చండి: సుప్రీంలో పిల్

: దేశరాజధాని దిల్లీలోని జంతర్‌మంతర్ ఇకపై నిరసనలకు అనువైన వేదికగా కాదని, అక్కడ చేపట్టే ఆందోళనలతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారంటూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అత్యవసర సేవలకు అంతరాయం కలుగుతోందని పిటిషన్ వాపోయారు. ఈ పిల్‌పై వాదనలు వినేందుకు సోమవారం అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. అలాగే కేంద్రం, సంబంధిత యంత్రాంగాలకు నోటీసులు జారీ చేసింది.

నిరసనలు చేపట్టేందుకు ప్రత్యామ్నాయ వేదికను కేటాయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ కోర్టు ను కోరారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో మంగళవారం ప్రధాని ఇంటి వరకు చేపట్టనున్న పాదయాత్ర గురించి ప్రస్తావించారు. మరోసారి 'జులై 20' నాటి పరిస్థితులు చోటుచేసుకోకుండా నివారించాలని కోరారు.

''స్థానికులకు ఇబ్బందులు, అత్యవసర సేవలకు అంతరాయం వంటి కారణాలతో జంతర్‌మంతర్ ఇకపై సరైన వేదిక కాదని పిటిషనర్ పేర్కొన్నారు. ఇది ముఖ్యమైన విషయమని మేం భావిస్తున్నాం. దీనిపై సంబంధిత అధికారుల నుంచి సూచనలు తీసుకోండి'' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. అలాగే పాదయాత్రపై స్పందిస్తూ.. ''అలాంటివి జరిగినప్పుడు ఎలాంటి వ్యవహరించాలో భద్రతాసిబ్బందికి తెలుసు. వారు సరిగా నిర్వహించని పక్షంలో మమ్మల్ని సంప్రదించవచ్చు'' అని సూచించారు.

# సీజేపీ నిరసనలను కేస్ స్టడీగా తీసుకోండి: ఆర్ఎస్ఎస్ నేత సూచన

ఇటీవల మహారాష్ట్రలోని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్సంయుక్త ప్రధాన కార్యదర్శి అతుల్ లిమయే మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కొద్ది రోజుల క్రితం దిల్లీలో జరిగిన సీజేపీ నిరసనల ను కేస్ స్టడీగా తీసుకొని, అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఏ ఉద్యమాన్నైనా కేవలం ఒక సంఘటనగా చూడకుండా.. దాని వెనక ఉన్న అసలు ఉద్దేశాన్ని తెలుసుకోవాలని అన్నారు.

మొదట ఆన్‌లైన్‌లో ఉద్భవించిన సీజేపీ పార్టీ కొన్ని రోజుల్లోనే దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల మద్దతును పొందడంపై అతుల్ లిమయే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది ప్రధానంగా యువత నేతృత్వంలో ప్రారంభమైన ఉద్యమం అయినప్పటికీ ఇందులో రైతులు, మానవహక్కుల కార్యకర్తలు, కార్మికులు, పర్యావరణవేత్తలు, ప్రముఖులు పాల్గొనేలా ప్రేరేపించిన విషయం ఏంటనేది తెలుసుకోవాలన్నారు. ఇంత వైవిధ్యమైన, భిన్నమైన రంగాలకు చెందిన వారిని, సంస్థలను ఒకే వేదికపైకి ఎవరు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఇది రాజకీయ ఉద్యమంగా మారడానికి గల కారణాలను విశ్లేషించుకోవాలని విద్యార్థులకు సూచించారు.






# పెద్ద చదువుల్లో... ప్రమాణాలు పెరుగుతాయా?

ఉన్నత విద్యారంగంలో సంస్కరణలకోసం కేంద్రం నిరుడు 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఆ బిల్లుపై చర్చ సందర్భంగా పలు విమర్శలు తలెత్తడంతో దాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపారు. జేపీసీ అధ్యయనం నేపథ్యంలో ప్రతిపాదిత బిల్లుపై విద్యావేత్తల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నత విద్యారంగాన్ని సంస్కరించే ప్రయత్నాన్ని ఎన్డీయే ప్రభుత్వం పదేళ్ల క్రితమే ప్రారంభించింది. అది అకడెమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ), స్వయం కోర్సుల రూపకల్పన, నేషనల్ డిజిటల్ లైబ్రరీ, ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఎమినెన్స్ వంటి వాటి రూపకల్పనకు దారితీసింది. వీటన్నింటికీ ఒక సమగ్ర రూపాన్ని ఇచ్చేందుకు కేంద్రం 2020లో జాతీయ విద్యావిధానాన్ని ప్రకటించింది. ఉన్నత విద్యను క్రమబద్ధీకరించడానికి ఒక సంస్థాగత నిర్మాణాన్ని ప్రతిపాదించింది. ఆ క్రమంలో నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషనల్ రెగ్యులేటరీ అథారిటీని స్థాపించాలని ప్రయత్నించింది. దీనికే ఆ తరువాత 'హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'(హెచ్‌ఈసీఐ)గా నామకరణం చేసింది. దాంతోపాటు విశ్వవిద్యాలయాలను బోధన, పరిశోధక సంస్థలుగా వర్గీకరించాలని, కళాశాల అనుబంధ పద్ధతిని తొలగించి వాటికి పూర్తి స్వయంప్రతిపత్తి కల్పించాలని తలపోసింది. అదే తరహాలో ఉన్నత విద్య నియంత్రణకు ఒక సంస్థను ఏర్పరచాలని భావించింది. ఆ దిశగా హెచ్‌ఈసీఐ ఏర్పాటుకు చర్యలు మొదలుపెట్టింది. అయితే, జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రకటించిన సంస్కరణలు నేటికీ చర్చల దశలో ఉన్నాయి. వాటికి 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్(వీబీఎస్ఏ) బిల్లు' ద్వారా తుది రూపునివ్వాలన్నది ప్రభుత్వం ఆలోచన!

**ప్రధాన సమస్యలకు పరిష్కారాలేంటి?**

దేశంలోని వర్సిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల బోధన, పరిశోధన, ఆవిష్కరణ, సమన్వయం తదితరాల్లో అత్యున్నత ప్రమాణాలు సాధించేందుకు అవసరమైన వ్యవస్థను కొలువుతీర్చడమే వీబీఎస్ఏ లక్ష్యమని అప్పట్లో పార్లమెంటులో ప్రకటించారు. హెచ్‌ఈసీఐకి దీన్ని కొత్తపేరుగా చెప్పవచ్చు. ఈ అధిష్ఠాన్ ఆధ్వర్యంలో రెగ్యులేటరీ, అక్రిడిటేషన్, స్టాండర్డ్స్ కౌన్సిళ్లు అనే మూడు విభాగాలుంటాయి. ఉన్నత విద్య నియంత్రణ బాధ్యతలను ప్రస్తుతం యూజీసీ, ఎన్‌సీఈఆర్‌టీ, ఏఐసీటీఈ నిర్వర్తిస్తున్నాయి. బిల్లు ప్రకారం అవి రద్దయ్యి, వాటి స్థానంలో రెగ్యులేటరీ కౌన్సిల్ ఏర్పాటవుతుంది. అయితే, ఏకీకృత వ్యవస్థ పేరుతో ఉన్నత విద్యపై కేంద్రం ఆధిపత్యం పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమన్వయం, ప్రమాణాల స్థిరీకరణ పేరుతో ఇప్పటికే ఉన్నత విద్యాసంస్థలపై రాష్ట్రాల అజమాయిషీని నామమాత్రం చేశారన్న వాదనలు ఉన్నాయి. ఈ విషయంగానే అటు రాష్ట్ర ప్రభుత్వాలు, ఇటు ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. స్వయం ప్రతిపత్తి కలిగిన ఐఐటీలు, ఐఐఎంలు, జాతీయ ప్రాధాన్యం కలిగిన సంస్థలు కూడా దీనికి అంతగా సుముఖంగా లేనట్లు చెబుతున్నారు. ఈ విషయంలో జేపీసీ ఎలాంటి పరిష్కారం ప్రతిపాదించిందో చూడాలి.

బిల్లులోని రెండో అంశం అక్రిడిటేషన్ కౌన్సిల్ ఏర్పాటు. నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచి, స్థిరీకరించేందుకు జాతీయ స్థాయిలో ఉన్నత విద్యాసంస్థలకు ర్యాంకులు, గ్రేడ్లు ఏర్పాటు చేసి అవి అంతర్జాతీయ ప్రమాణాలు అందుకునేలా ప్రోత్సహించడం అభిలషణీయమే. ప్రస్తుతం న్యాక్, ఎన్‌బీఏ వంటి సంస్థలు ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాల కొలమానంలో వేటి నియమాలు, విధానాలు వాటికి ఉన్నాయి. ఈ విషయంలో అన్ని సంస్థలు విమర్శలు ఎదుర్కొంటున్నాయి. 'న్యాక్' సంస్థ రెండేళ్లుగా క్రియారహితంగా ఉంది. 'ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్'కు దేశంలోని ప్రతి ఉన్నత విద్యాసంస్థ తమ సమాచారాన్ని తప్పనిసరిగా అందించాలన్న నిబంధన ఉంది. ఇలా సమాచారాన్ని కోరుతున్న సంస్థల్లో సారూప్యత లేదు. దాన్ని ఉపయోగించి, ఉన్నతవిద్యా ప్రమాణాలను ఎలా మెరుగుపరుస్తారన్న స్పష్టత కొరవడింది. ఇదంతా గందరగోళానికి దారితీస్తోంది. 'వన్ నేషన్ వన్ డాటా' అనే నినాదాన్ని తెరపైకి తెచ్చినా, దాని అమలుపై నేటికీ సందిగ్ధత నెలకొంది. వీటన్నింటినీ గమనంలోనికి తీసుకుని బిల్లును పకడ్బందీగా ఎలా రూపొందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

**సంస్థాగత మార్పులతో ప్రయోజనమెంత?**

ఇక మూడో అంశం 'ప్రమాణాల స్థిరీకరణ'కు సంబంధించింది. బిల్లు ప్రకారం ఈ విధులను నూతనంగా ఏర్పరచబోయే 'స్టాండర్డ్స్ కౌన్సిల్' చూస్తుంది. వాస్తవానికి ఉన్నతవిద్యా ప్రమాణాల విషయంలో ఇంతవరకు దేశీయంగా పెద్దగా సాధించింది ఏమీలేదు. బాగా చర్చనీయాంశమైన నాలుగేళ్ల డిగ్రీ కోర్సు, దేశంలో పెద్దగా పట్టాలకెక్కిన దాఖలాలు లేవు. అలాగే ఇంజినీరింగ్ విద్యలో కంప్యూటర్ కోర్సులు మినహా మిగిలినవి ఎంపిక చేసుకునేవారు అంతగా ఉండటంలేదు. ఇక ఉపాధ్యాయ నైపుణ్య శిక్షణను సాధారణ విద్యతో మిళితం చేయాలనే సంకల్పం ఆచరణలో ఒక కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో ప్రమాణాలు లేదా పాఠ్యాంశాల స్థిరీకరణ పెద్ద సవాలుగా మారింది.

ప్రస్తుతం ఉన్నత విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, ధోరణుల విషయంలో కేవలం సంస్థాగత మార్పుల వల్ల ఒనగూడే ప్రయోజనం పరిమితమే. ఆయా సంస్థలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, సమర్థంగా పనిచేసినప్పుడే ఈ రంగంలో గుణాత్మక మార్పు సాధ్యమవుతుంది. ఉన్నత విద్యకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న వ్యయం అతిస్వల్పం. ఆ రంగం మొత్తంగా కేంద్రం కనుసన్నల్లోకి వెళ్తే రాష్ట్రాలు నామమాత్రంగా మిగులుతాయి. ఇది ఆశించదగిన పరిణామం కాదు. వాస్తవానికి ఉన్నత విద్యారంగంలో వర్సిటీలు, విద్యార్థుల ప్రవేశాల పరంగా రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర గణనీయమైనదే. అందువల్ల రాష్ట్రాల భాగస్వామ్యం లేకపోతే ఉన్నత విద్యాసంస్థలు, ప్రమాణాలు ఇంకా దెబ్బతినే ప్రమాదముంది. కాబట్టి, ప్రతిపాదిత బిల్లుకు ఆమోదం తెలిపే ముందు పార్లమెంట్ ఈ కీలకాంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి.



# బంకీపూర్ ఉప ఎన్నిక- బీజేపీ నాయకత్వానికి ఒక గట్టి హెచ్చరిక

**బీహార్‌లో బీజేపీ నేతృత్వంలోని సామ్రాట్ చౌదరి ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగు నెలలు దాటుతున్న తరుణంలో, ఆ పార్టీకి బలమైన కంచుకోటగా ఉన్న 'బంకీపూర్' అసెంబ్లీ స్థానం ఉపఎన్నిక ఫలితాల్లో గట్టి దెబ్బ తగిలింది. బిహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక ఫలితాల్లో జన్ సూరాజ్ పార్టీ (JSP) వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (PK) 19 వేలకు పైగా ఓట్ల భారీ మెజారిటీతో బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై చారిత్రాత్మక విజయం సాధించారు. 1995 నుండి (గతంలో పాట్నా వెస్ట్) బీజేపీకి తిరుగులేని కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో పరాజయం పాలుకావడం ఆ పార్టీకి కోలుకోలేని పెద్ద దెబ్బగా మారింది. బంకీపూర్ నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా బీజేపీ ఓటమి ఎరుగదు. ఈ స్థానం నుంచి ఐదుసార్లు వరుసగా గెలిచిన బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్ రాజ్యసభకు ఎన్నికవడంతో ఈ ఉపఎన్నిక వచ్చింది. అలాంటి సురక్షితమైన స్థానంలో బీజేపీ ఓడిపోవడం ఆ పార్టీ ప్రతిష్ఠను తీవ్రంగా దెబ్బతీసింది.**



రొద్దం శ్రీనివాసులు
(వ్యాసకర్త
సీనియర్ జర్నలిస్ట్)

ఎన్నికల ముందే బీజేపీ అభ్యర్థి విషయంలో తీవ్ర గందరగోళం నెలకొంది. మొదట ప్రకటించిన అభ్యర్థి అభిషేక్ కుమార్ నామినేషన్ వేసిన మరుసటి రోజే "వ్యక్తిగత కారణాలతో" ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత యువజన విభాగ నేత నీరజ్ కుమార్ సిన్హాను హడావుడిగా బరిలోకి దించాల్సి వచ్చింది. ఈ పరిణామం అప్పట్లోనే పార్టీ బలహీనతను, అంతర్గత అసంతృప్తిని బయటపెట్టింది.

ఈ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని బీజేపీ తన శక్తినంతటినీ ధారబోసింది. ప్రచారం కోసం ఏకంగా 50 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ఎంపీలు, 16 మంది మంత్రులను రంగంలోకి దించింది. ముఖ్యమంత్రి కూడా ప్రత్యేకంగా అభ్యర్థి తరఫున ప్రచారం చేశారు. ఇంతమంది అగ్రనాయకులు శ్రమించినా కనీస పోటీ ఇవ్వలేకపోవడం పార్టీ వ్యూహాత్మక వైఫల్యాన్ని సూచిస్తోంది.

ఎన్నికల వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిశోర్ నేరుగా బరిలోకి దిగిన మొదటి ఎన్నిక ఇదే. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన జన్ సూరాజ్ పార్టీ, ఈ ఉపఎన్నికలో ఏకంగా బీజేపీ కంచుకోటను చేజిక్కించుకోవడం ద్వారా రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా అవతరించింది.

**ఓట్ల శాతం మరియు ఫలితాల పట్టిక ఈ ఉపఎన్నికలో నమోదైన ఓట్ల వివరాలను పరిశీలిస్తే:**

| అభ్యర్థి | పార్టీపోలైన ఓట్లు | ఓట్ల శాతం (%) |
|---|---|---|
| ప్రశాంత్ కిశోర్ (విజేత)జన్ సూరాజ్ పార్టీ | 46,377 | 48.47% |
| నీరజ్ కుమార్ సిన్హా భా రతీయ జనతా పార్టీ (BJP) | 33,108 | 34.60% |
| రేఖా కుమారి రాష్ట్రీయ జనతా దళ్ (RJD) | 10,925 | 11.42% |

**ఆరు నెలల లోపు మారిన బీహార్ రాజకీయం**

2025 నవంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ (JDU)బీజేపీ కూటమి (NDA) ఘనవిజయం సాధించింది. అయితే, అనూహ్య పరిణామాల మధ్య ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మార్చి 2026 లో రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకుని తన పదవికి రాజీనామా చేశారు. నితీష్ కుమార్ నిష్క్రమణ తర్వాత 2026 ఏప్రిల్ లో బీజేపీకి చెందిన సామ్రాట్ చౌదరి (Samrat Choudhary) బీహార్ కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఇంకా 4 నెలలు కూడా కాకముందే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు, అవినీతి పెరిగాయంటూ ఆర్జేడీ (RJD) వంటి ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ ఈ ఉప ఎన్నిక తీర్పు వెలువడింది. బంకీపూర్ పూర్తిగా పట్టణ, మధ్యతరగతి, విద్యావంతులు ఎక్కువగా ఉండే నియోజకవర్గం. దేశవ్యాప్తంగా జరిగిన పేపర్ లీకేజీలు, నిరుద్యోగ సమస్యలపై యువత (Gen Z) నిరసనల ప్రభావం ఈ ఎన్నికలపై స్పష్టంగా కనిపించింది. ప్రశాంత్ కిశోర్ తీసుకొచ్చిన విద్యా, ఉపాధి, అభివృద్ధి ఎజెండా వైపు యువ ఓటర్లు మొగ్గు చూపడం బీజేపీ సాంప్రదాయ ఓటు బ్యాంకును చీల్చింది. సాంప్రదాయ కుల రాజకీయాలు, కూటముల లెక్కలను కాదని, పట్టణ ప్రాంత ఓటర్లు ప్రశాంత్ కిశోర్ వైపు నిలవడం, బిహార్ రాబోయే అసెంబ్లీ సమరానికి ముందు బీజేపీ నాయకత్వానికి ఒక గట్టి హెచ్చరిక లాంటిదని చెప్పాలి.

# వాంగ్‌చుక్... ఆ గళాలన్నీ గప్‌చుప్!

**ఆ ఇరువురూ ధర్మ యోధులు. పాలనావ్యవస్థలో అవినీతికి, అసమర్థతకు వ్యతిరేకంగా ప్రాణత్యాగానికి సాహసించి నిరవధిక నిరాహార దీక్షలతో ప్రభుత్వాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీరులు. వారి ధర్మ పోరాటాల మధ్య కాల విరామం పదిహేను సంవత్సరాలు మాత్రమే. వాటి కథలు భిన్నమైనవి. దేశ రాజకీయాలలో, ప్రజా దృక్పథాల్లో ఒక స్పష్టమైన మార్పును అవి సూచిస్తున్నాయి.ఆ నైతిక యోధులలో ఒకరు అన్నా హజారే. 1990ల్లో మహారాష్ట్రలో సమాచార హక్కు చట్టం కోసం, అవినీతిపరులైన అధికారులపై చర్యలను డిమాండ్ చేస్తూ ఆయన అనేక ఆందోళనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. వాటికి పరాకాష్ఠ జన్‌లోక్‌పాల్ ఉద్యమం. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్ వ్యవస్థను నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5, 2011న ఆయన నిరాహారదీక్షకు ఉపక్రమించారు. నాలుగు రోజుల పాటు సాగిన ఆ పోరాట దీక్ష, జన్ లోక్‌పాల్ బిల్లు ముసాయిదా రూపకల్పనకు ఒక సంయుక్త సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో ముగిసింది. తిరిగి అదే ఏడాది ఆగస్టు 16న న్యూఢిల్లీలోని సుప్రసిద్ధ రామ్‌లీలా మైదానంలో అన్నా మళ్లీ నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఆయన డిమాండ్లకు అనుకూలంగా పార్లమెంటు ఒక తీర్మానాన్ని ఆమోదించడంతో అన్నా దీక్ష పన్నెండవ రోజున (ఆగస్టు 28) ముగిసింది. లోక్‌పాల్ కోసం నిర్వహించిన దీక్షలతో ఆయన ఆసేతు హిమాచలం ఆబాలగోపాలానికి సుపరిచితుడు అయ్యారు.**



అన్నా హజారే డిమాండ్ సాపేక్షంగా నిరపాయకరమైనది. అవినీతిని నిర్మూలించేందుకు గట్టిచర్యలు చేపట్టేందుకు జాతీయస్థాయిలో స్వతంత్ర లోక్‌పాల్ వ్యవస్థను సృష్టించాలనేది ఆయన డిమాండ్. అవినీతి అనేది చాలామంది పాల్పడుతున్నదే కదా అనే ఉదాసీనత దేశంలో అవినీతి పెచ్చరిల్లిపోయేందుకు దారితీస్తోంది. అందరూ చట్టోల్లంఘనకు పాల్పడుతున్నప్పుడు తాను ఒక్కణ్నే చట్టానికి కట్టుబడి ఉండడం వల్ల ప్రయోజనమేముంది అన్న ఆలోచనతో అత్యధికులు అవినీతికి కారకులవుతున్నారు. పైగా, అన్నాహజారే నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్న సందర్భంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అనేక కుంభకోణాలతో అప్రతిష్ఠ పాలయివున్నది. ప్రభుత్వ ప్రమేయమున్న ప్రతి వ్యవహారంలోను అవినీతి చోటుచేసుకున్నదని ప్రజలు విశ్వసించిన కాలమది. దీంతో, అన్నా ఆందోళనకు అశేష ప్రజల మద్దతు లభించింది.

రామ్‌లీలా మైదానంలో అన్నా హజారే నిరాహార దీక్షకు మద్దతు తెలిపేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి రావడాన్ని టెలివిజన్ చానెల్స్ ప్రత్యక్ష ప్రసారం చేశాయి. వృత్తి విధులను నైతిక నిష్ఠతో నిర్వహించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ లాంటి వారే కాకుండా యోగా గురువు బాబా రామ్‌దేవ్ లాంటివారు కూడా అన్నా ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిచ్చారు. అవినీతిని తాము ఎంత చిత్తశుద్ధితో వ్యతిరేకిస్తుందీ చాటుకోవడానికి అన్నా ఉద్యమానికి మద్దతునివ్వడం ఒక ప్రయోజనకరమైన మార్గమని అనేకానేకమంది విశ్వసించారు. అయితే, అన్నా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన అసలు శక్తి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. దేశవ్యాప్తంగా శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న ఈ సంస్థ తన అసంఖ్యాక కార్యకర్తలను అన్నా ఉద్యమాగ్నులు మరింతగా ప్రజ్వరిల్లేలా చేసేందుకు నియోగించింది. నర్మదాసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించిన మేధా పాట్కర్; సోషలిస్టు మేధావి యోగంద్ర యాదవ్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మొదలైనవారు కూడా హజారే ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిచ్చారు. అయితే ఆ ఉద్యమ అంతిమ విజేత మట్టుకు భారతీయ జనతా పార్టీ. 2014 సార్వత్రిక ఎన్నికల ఫలితాలే అందుకు తిరుగులేని నిదర్శనం.

అన్నా ఉద్యమ ఉధృతిలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికీ ఒక పాత్ర ఉన్నది. ఉద్యమ జటిలతను మన్మోహన్ సర్కార్ తొలుత అర్థం చేసుకోలేదు. ఆ క్లిష్ట పరిస్థితి అర్థంకాగానే అన్నాతో 'సంప్రదింపులు' జరిపేందుకు కేబినెట్ మంత్రులు ప్రణబ్ ముఖర్జీ, ఏకే ఆంటోనీలతో పాటు మరో ఇద్దరు ప్రముఖుల సహాయాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకుంది. ఒకరు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విలాసరావు దేశ్‌ముఖ్, మరొకరు 'నాబార్డ్' మాజీ చీఫ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర సారంగి. హజారేతో చర్చలు సఫలమయేందుకు ఈ ఇరువురూ విశేషంగా తోడ్పడ్డారు. ప్చ్, ప్రయోజనమేముంది? అప్పటికే యూపీఏ సర్కార్ చేతుల్లోంచి కాలం జారిపోయింది. అరేబియా జానపద గాథలో వలే సీసా నుంచి భూతం బయటపడింది, మళ్లీ దాన్ని సీసాలో బంధించడం అసాధ్యమైపోయింది.

పర్యావరణ పరిరక్షణ యోధుడు, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష అన్నాహజారే ఆందోళనకు పూర్తి భిన్నమైనది. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది- వాంగ్‌చుక్ డిమాండ్ నిర్దిష్ట వాస్తవికత ఆధారంగా చేసింది. జాతీయస్థాయి ప్రవేశపరీక్షలో అవకతవకలతో కోట్లాది విద్యార్థినీ విద్యార్థులు లోనైన కష్టనష్టాలకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్. దీనితో పోల్చితే అన్నా డిమాండ్ సైద్ధాంతికమైనది, సంకీర్ణమైనది. అన్నా, వాంగ్‌చుక్ డిమాండ్ల మధ్య వ్యత్యాసం ఆ ఇరువురి రాజకీయ చతురత మధ్య తారతమ్యతకు అద్దం పడుతుంది. హజారేకు ఉన్నత స్థాయిలో రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఆయనను ప్రభావితం చేయడమూ సులువైన విషయమే. అన్నాతో పోలిస్తే వాంగ్‌చుక్ దృఢ విశ్వాసాలు ఉన్న పోరాటకారుడు. ఆయన ఒకసారి ఒక నిర్ణయానికి వస్తే మరెవ్వరూ ఆయన్ని అందుకు విరుద్ధంగా వ్యవహరించేలా ప్రభావితం చేయలేరు. తన నిర్ణయం నెగ్గేంతవరకు పట్టుదలతో ఉండే యోధుడు ఆ హిమాలయ భారతీయుడు. అన్నా డిమాండ్‌ను నెరవేర్చితే ముంచుకొచ్చే ముప్పు ఏమీలేదు. ఎందుకంటే ఆ డిమాండ్ అంతిమంగా నిరుపయోగకరమైనది. వాంగ్‌చుక్ పోరాట లక్ష్యం కంటే అన్నా ఉద్యమ ఆశయాన్ని నెరవేర్చడం సులభం.

రెండోది- వాంగ్‌చుక్‌కు ప్రతిపక్షాల మద్దతు లేకపోవడం. అన్నా ఆందోళన సందర్భంలో ఆనాటి ప్రతిపక్షం బీజేపీ ఆ ఉద్యమాన్ని తన రాజకీయ ప్రయోజనాల పురోగతికి ఒక అపూర్వ అవకాశంగా పరిగణించింది. మన్మోహన్ సర్కార్ పాలనలోని అవినీతిని ఎండగట్టేందుకు ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నది. వాంగ్‌చుక్ పోరు సందర్భంలో ప్రస్తుత ప్రతిపక్షం ఏమి చేస్తున్నది? స్తబ్ధుగా ఉండిపోవడమే కాదూ? ఈ మందకొడితనానికి కారణమేమిటి? ప్రతిపక్షాలు వేటికవిగా ఉండిపోవడమే. ఈ అనైక్యత వల్లే మోదీ సర్కార్‌ను సవాల్ చేసేందుకు వాటికొక సమైక్య, సుసంగత వ్యూహం లేకుండాపోయింది. వాంగ్‌చుక్ ఉద్యమ మనోరథం నెరవేరితే తమకు సమకూరే ప్రత్యక్ష ప్రయోజనమేదీ లేదని విపక్షాలు భావిస్తున్నాయి. అన్నా ఉద్యమం ప్రత్యక్ష లబ్ధిదారు బీజేపీ. అందుకే అది ఆనాడు ఆ ఆందోళనను అన్ని విధాలా ఎగదోసింది, లబ్ధి పొందింది. అన్నా హజారే బీజేపీ చేతుల్లో కీలుబొమ్మ. వాంగ్‌చుక్ అలా కాదు, ఆయన ఒంటరి యోధుడు.

హజారే ఆందోళనలో సమస్త భారతీయులూ అవినీతికి వ్యతిరేకంగా ముక్తకంఠంతో ఘోషించారు.. అవినీతి పాలకులను అధికారం నుంచి తొలగించేందుకు సమైక్యమయ్యారు. సినీ పరిశ్రమలోని హీరోలు, హీరోయిన్లతో పాటు అంతగా ప్రాధాన్యం లేని నటీనటులు కూడా అవినీతిని గర్హించారు, నాటి పాలకులపై ధ్వజమెత్తారు. మరి వాంగ్‌చుక్ ఉద్యమ సందర్భంలో ఆ గళాలు ఏవీ? ఆ లోకహితులు కానరాలేదేమీ? వ్యాపార దిగ్గజాలు, పారిశ్రామిక ప్రముఖులలో పలువురు ఆనాడు ఉదారంగా అన్నా ఉద్యమానికి బాసటగా నిలబడ్డారు. మోదీ ప్రభుత్వ నీడలో ఉన్న ఆ దిగ్గజాలు, ప్రముఖులు ఇప్పుడు ఆత్మపరిశీలనా యోగంలో నిమగ్నులై ఉన్నారు. కేవలం పదిహేను సంవత్సరాల వ్యవధిలో మన సజీవమైన, ఉద్వేగ భరితమైన, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం ఎంత నిశ్శబ్దంగా మారిపోయిందో కదా!

మౌనం, అంతటా మౌనం. ఈ మౌనాన్ని ప్రశ్నించేందుకు మనం సిద్ధంగా ఉన్నామా? మన ప్రజాస్వామ్యం సమస్త పౌరుల శ్రేయస్సును కోరే, దానిని సాధించే గొంతుకను మళ్లీ పొందేందుకు తోడ్పడుతుందా? ఈ ప్రశ్నలను జరూరుగా పరిష్కరించుకోవాలి. లేనిపక్షంలో ప్రస్తుత మౌనం మూగవారి నిశ్శబ్దాన్నే ప్రతిధ్వనిస్తుంది.

# ప్రజారోగ్య సంరక్షణలో ముందడుగు

నూటనలభైకి పైగా దేశాలపై ప్రభావం చూపుతున్న డెంగీ నేటికీ కనీసస్థాయి పారిశుద్ధ్యానికి నోచుకోని జనావాసాలెన్నో ఉన్న భారతావనిలో స్వైరవిహారం చేస్తోంది. సర్కారీ లెక్కల ప్రకారమే గడచిన రెండున్నర దశాబ్దాల్లో దేశీయంగా ఆ వ్యాధిపీడితుల సంఖ్య 11 రెట్లు పెరిగింది. కానీ, వాస్తవంగా ఆ కేసులు అంతకు 282 రెట్లు ఎక్కువగా ఉంటాయనే దిగ్భ్రాంతికర సమాచారాన్ని భారత ఉష్ణమండల వాతావరణ పరిశోధన సంస్థ నిరుడు వెల్లడించింది. పెచ్చుమీరుతున్న ఉష్ణోగ్రతలు, అస్తవ్యస్తమైన వర్షపాతం, కట్టుతప్పుతున్న పట్టణీకరణల మూలంగా డెంగీని మోసుకొచ్చే దోమలు మునుపటికంటే ఎక్కువ రోజులు బతుకుతున్నాయి. కొత్త ప్రాంతాలకూ వ్యాపిస్తున్నాయి. దాంతో సీజనల్ వ్యాధి అయిన డెంగీ ఇప్పుడు ఏడాది పొడవునా కోరచాచే మహమ్మారిగా మారుతోంది. వివిధ కారణాల రీత్యా తీవ్రస్థాయి డెంగీ బాధితులకు కొన్ని సందర్భాల్లో గుండె, మూత్రపిండాల వైఫల్యాల ముప్పు సైతం పొంచి ఉంటుంది. ఇంతటి ప్రమాదకరమైన డెంగీని నివారించడానికి అక్కరకొచ్చే 'క్యూడెంగా' టీకాకు తాజాగా భారత ఔషధ నియంత్రణ సంస్థ ఆమోదం లభించడం ప్రజారోగ్య సంరక్షణలో కీలక ముందడుగు!

డెంగీ వైరస్‌లలో నాలుగు రకాలు ఉండటం వల్ల ఆ వ్యాధి వ్యాప్తిని కట్టడి చేయడం కష్టతరమవుతోంది. ఒక రకం వైరస్ బారినపడినవారికి కూడా మరోదానివల్ల ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశముండటమే వ్యాక్సిన్ తయారీలో శాస్త్రవేత్తలకు సంక్లిష్ట సవాలు అయ్యింది. జపనీస్ సంస్థ తకేడా బయోఫార్మాకు చెందిన 'క్యూడెంగా' టీకా ఈ నాలుగు రకాల డెంగీ వైరస్‌ల నుంచి సమర్థంగా రక్షణ కల్పించగలదంటున్నారు. జబ్బుతో ఆసుపత్రిలో చేరాల్సిన అవసరాన్ని గణనీయంగా తగ్గించడంలో అది విజయవంతమైనట్లు చెబుతున్నారు. అయితే, ఏ టీకా కూడా నూటికినూరుపాళ్లు భద్రత కల్పించలేదు. కాబట్టి దోమల సంతతి విశృంఖలం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడమే డెంగీ నివారణకు అత్యుత్తమ మార్గమనడంలో మరో మాటకు తావులేదు. డెంగీ వల్ల కుటుంబాలపై పడే వైద్యవ్యయ భారం, ఉత్పాదకత నష్టం తదితరాలతో మన దేశం ఏడాదికి పదివేల కోట్ల రూపాయలకు పైగా కోల్పోతున్నట్లు అంచనా. మలేరియా మూలంగా మరో 18వేల కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లుతోంది. దోమల వల్ల వ్యాపించే చికెన్‌గున్యా, ఫైలేరియా వంటివాటితో సంభవిస్తున్న కడగండ్లను కూడా కలిపి చూస్తే జనభారత ఆర్థిక, ఆరోగ్య శ్రేయస్సుకు పరిసరాల పరిశుభ్రత ఎంతటి ప్రాణావసరమో అవగతమవుతుంది!

అటవీ విస్తీర్ణం తరిగిపోయి జీవవైవిధ్యం దెబ్బతింటున్న కొద్దీ దోమల ఆహారపుటలవాట్లలో మార్పులు వస్తున్నాయని, మానవ రక్తానికి అవి మరింతగా మరుగుతున్నాయని ఇటీవలి ఒక అంతర్జాతీయ అధ్యయనంలో తేలింది. పీఎం2.5గా పేర్కొనే సూక్ష్మధూళికణాల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఆ వాయుకాలుష్యానికి గురవుతున్నవారిలో రోగనిరోధక, రక్తనాళ వ్యవస్థలు బలహీనమై డెంగీ తీవ్రత ప్రబలమవుతోంది. పర్యావరణాన్ని నాశనం చేస్తున్న మానవ కార్యకలాపాల కారణంగా వ్యాధుల విజృంభణ అధికమవుతున్న నేపథ్యంలో ఆత్మవినాశక పోకడలను విడనాడి ప్రకృతిని కాపాడుకోవడం అందరికీ విధ్యుక్తధర్మం కావాలి. దోమల నిర్మూలన కార్యక్రమాలను మాటవరసకు పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో గట్టి ఫలితాల సాధనకు ప్రభుత్వాలు ఉపక్రమించాలి. చెత్తకుప్పల తొలగింపు నుంచి మురుగునీటి కాల్వలను శుభ్రంచేయడం వరకు అన్నింటిపై దృష్టిపెడుతూనే సర్కారీ ఆసుపత్రుల్లో వైద్య వసతుల వృద్ధికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి!

# పి జి ఆర్ ఎస్ అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలి




**- జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు వస్తున్నాయి**
**- రీఓపెన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, ఆగస్టు 03 అనంత జనశక్తి న్యూస్**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్ నందు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పి జి ఆర్ ఎస్ అర్జీలపై ఆర్డీవోలు, తాసిల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 80% భూ సమస్యలు వస్తున్నాయని తాసిల్దారులు భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. సర్వేకు సంబంధించిన సమస్యలు వచ్చినప్పుడు ఏడి సర్వేయర్ వెంటనే స్పందించి మండల సర్వేయర్ల ద్వారా సర్వే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఒక అర్జీదారుడు తన భూమి సర్వే చేయించాలని 2062026 వ తేదీ ఆన్లైన్లో చలానా కట్టి అర్జీ సమర్పించినప్పటికీ ఆ సర్వేయర్ ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా సర్వేర్లు సర్వే సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలోని ఆర్డీవోలు తాసిల్దార్ కార్యాలయాలలో ఫీల్డ్ విజిట్ చేసి పిజిఆర్ఎస్ అర్జీలు ఎంతవరకు పరిష్కారమయ్యాయి. ఇంకా పరిష్కారం కానీ అర్జీలపై సంబంధిత తహసీల్దారులతో మాట్లాడి అర్జీలు క్లియర్ చేయించాలన్నారు.

లాంగ్ పెండింగ్ కేసులపై ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలన్నారు. రీఓపెన్ దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు రీఓపెన్ చేశారు. ఎన్ని పరిష్కరించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు.

ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఒక వ్యక్తి అర్జీ సమర్పించినప్పుడు ఆ సమస్య పరిష్కారం అవుతుందా లేదా క్లియర్ గా చదివి పరిష్కారం అయ్యేటట్లు అయితే సమస్య పరిష్కరించి పరిష్కరించలేని ఎడల ఎందుకు పరిష్కరించలేమో అర్జీదారునికి అర్థం అయ్యేవిధంగా ఎండార్స్మెంట్ క్లియర్ గా ఇవ్వాలన్నారు.

ఇలా చేయడం వల్ల చాలా వరకు బాధితుల సమస్యలు పరిష్కరించవచ్చునన్నారు.

'వన్ మంత్ ఫోర్ విజిట్' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించే విధంగా తాసిల్దారులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలు రకాల సమస్యలతో ప్రజలు వస్తుంటారని ప్రజల అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత వరకు బాధితుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమస్య పరిష్కరించ లేనట్లయితే వెంటనే అతనికి అర్థమయ్యే విధంగా చెప్పి ఎన్డార్స్మెంట్ ఇవ్వాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, ల్యాండ్ అండ్ సర్వే ఏడి, తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**- ఆకట్టుకునే అభివృద్ధి శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలి**
**- ముందస్తు ఏర్పాట్లలో కేటాయించిన విధులను బాధ్యతగా పూర్తి చేయాలి**
**- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**




**పుట్టపర్తి, ఆగస్టు 03 :అనంత జనశక్తి న్యూస్**

ఈ నెల 15న నిర్వహించనున్న 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు.80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పరేడ్ మైదానంలో చేపట్టాల్సిన సన్నాహకాలపై సోమవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్ లో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్,జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ, వేదిక ఏర్పాట్లు, అలంకరణ పనులను సుందరంగా చేపట్టాలని సూచించారు. పరేడ్ మైదానంలో బారికేడింగ్, వైట్ వాష్ తదితర పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్ & బి అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రత్యేక అతిథులను గౌరవప్రదంగా ఆహ్వానించాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని పుట్టపర్తి మునిసిపల్ కమిషనర్ను ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు, ప్రోటోకాల్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిఆర్ఓ కు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లాలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని డిఆర్డీఏ, డ్వామా, వ్యవసాయ అనుబంధ శాఖలు, ఏపీఎంఐపీ, జల వనరుల శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దేశభక్తిని చాటే విధంగా ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, వేడుకల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీడిసిఎల్ అధికారులను ఆదేశించారు.ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు సమర్పించాలని తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసుల మార్చ్ఫాస్ట్ లో ఎన్సీసీ కేడెట్లను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ... జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పోలీస్ శాఖ తరపున చేపట్టాల్సిన అన్ని భద్రతా, పరేడ్ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, ఎఎస్పి అంకిత సురన, జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, ఆర్డీవో సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయ అభివృద్ధిలో సీనియర్ ఆచార్యుల సేవలు చిరస్మరణీయం



**అనంతపురం ఆగస్ట్ 03, అనంత జనశక్తి న్యూస్**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో సీనియర్, విశ్రాంత ఆచార్యులు అందించిన సేవలు చిరస్మరణీయమని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రగతికి తమ జీవితాలను అంకితం చేసిన సీనియర్ ఆచార్యులను సత్కరించడం గర్వకారణమని అన్నారు. విశ్వవిద్యాలయంలో పూలే భవన్ లో నిర్వహించిన విశ్రాంత ఆచార్యుల జనరల్ బాడీ కార్యక్రమంలో 75 సంవత్సరాలు పైబడిన సీనియర్ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులను సన్మానించారు. తమ బోధన, పరిశోధన, మార్గదర్శకత్వం ద్వారా వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంతో పాటు, విశ్వవిద్యాలయ విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో సీనియర్ ఆచార్యుల పాత్ర ఎంతో కీలకమని ఉపకులపతి తెలిపారు.ఈ సందర్భంగా 75 సం" పైబడిన సీనియర్ ఆచార్యులు డి ఆర్ వి ప్రసాద రావు, ఉమా మోహన్, ఆచార్య శేషశాస్త్రి, ఎల్.వేణుగోపాలరెడ్డి, ప్రొఫెసర్ కె. రవీంద్రనాథ్, ప్రొఫెసర్ టి. పుల్లయ్య గార్లను ప్రత్యేకంగా సన్మానించారు. వారి విద్యా, పరిశోధనా సేవలు విశ్వవిద్యాలయానికి విలువైన వారసత్వంగా నిలిచాయని పేర్కొన్నారు.విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. అంజనేయులు మాట్లాడుతూ, సీనియర్ ఆచార్యులు నెలకొల్పిన విద్యా ప్రమాణాలు, పరిశోధనా సంప్రదాయాలు ప్రస్తుత తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. వారి అనుభవాలు, సూచనలు విశ్వవిద్యాలయ భవిష్యత్ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.సీనియర్ ఆచార్యులు తమ అనుభవాలను పంచుకుంటూ, విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల శ్రేయస్సు, నాణ్యమైన విద్య, పరిశోధన మరియు సమాజ సేవకు విశ్వవిద్యాలయం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుల సంఘం సభ్యులు ఆచార్యులు టి. పుల్లయ్య, రవీంద్రా రెడ్డి, ఫణీశ్వరరాజు, సి యన్ కృష్ణా నాయక్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని సీనియర్ ఆచార్యుల సేవలను కొనియాడారు. పూర్వ ఆచార్యుల అనుభవం, ప్రస్తుత తరానికి మార్గదర్శకత్వం, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# గోదావరి పుష్కరాల నాటికి ఇంటింటికి శుద్ధి చేసిన గోదావరి జలాలు




**- మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు ఆగస్ట్ 03 అనంత జనశక్తి న్యూస్**

**గోదావరి నీరు చెంతనే ఉన్నప్పటికీ, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజల కష్టాలకు త్వరలోనే విముక్తి లభిస్తుందని, గోదావరి పుష్కరాల నాటికి ఇంటింటికి శుద్ధి చేసిన గోదావరి జలాలను సరఫరా చేసే బాధ్యత తమదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. సోమవారం నిడదవోలు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పెరవలి మండలంలో వేగంగా జరుగుతున్న 'జల్ జీవన్ మిషన్' పనులను మరియు ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గతేడాది పెరవలిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన జల్ జీవన్ మిషన్ పనులను గుర్తుచేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జల్ జీవన్ మిషన్ పనులు జరగలేదని విమర్శించారు.. అంతేగాక భూగర్భ జలాలు కలుషితమై అడుగంటిపోతున్న నేపథ్యంలో గోదావరి జలాలను శుద్ధి చేసి అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా విజ్జేశ్వరం వద్ద 500 కిలో లీటర్ల నీటిని శుద్ధి చేసేలా అత్యాధునిక ఎస్టీపీ ప్లాంట్ను ఏర్పాటు చేస్తున్నామని, అక్కడి నుండి ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా ప్రతి గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు నీరు చేరుతుందని అక్కడి నుండి ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీటిని సరఫరా చేస్తామని వివరించారు. ప్రధానంగా తాను ఇప్పుడు పరిశీలించిన ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా దాదాపు 15 గ్రామాల ప్రజలకు 60 వేల లీటర్ల శుద్ధి చేసిన మంచినీరు అందుబాటులోకి రానుందన్నారు. ఈ ప్రాజెక్టు పనులను మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి ప్రతి ఇంటికీ మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి శరవేగంగా పూర్తి చేస్తోందని, పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్న స్థానిక కూటమి నాయకులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. అంతకుముందు నిడదవోలు పట్టణంలోని ఉజ్జనివారి వీధిలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యపై స్థానికులు మంత్రి దుర్గేష్ కి విన్నవించగా ఆయన తక్షణమే స్పందించారు. ఘటనాస్థలిని సందర్శించి అధికారులను ఆదేశించడంతో అధికారులు అత్యవసర చర్యలు చేపట్టి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. నేడు ఆ పనులను స్వయంగా పరిశీలించిన మంత్రి దుర్గేష్ స్థానికులతో మాట్లాడి త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.**

## యల్లనూరులో పందులు చోరీ...

**యల్లనూరు, ఆగస్టు 3, అనంత జనశక్తి న్యూస్;**



**మండల కేంద్రంలోని పలువురు ఎరికల కులస్తులకు చెందిన పందులను ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఓ టాటా ఏసీ వాహనంలో దొంగ తనానికి తెగబడ్డారు. విషయం తెలుసుకున్న పందులు నిర్వహకులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా అప్పటికే వాహనంలో తెచ్చుకున్న రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, హోంగార్డు రామనాథ సైతం వారిని పట్టుకునేందుకు వెంబడించగా వారిపై కూడా రాళ్లతో దాడులకు పాల్పడి పోలీసుల నుండి దొంగలు తప్పించుకొని పరారయ్యారు. ఈ చోరీలో నాగన్న చెందిన 24 పందులను, దుబ్బన్నకు చెందిన 14పందులను దొంగలు ఎత్తుకెల్లగా, వీటి విలువ దాదాపు రూ. 2.60 లక్షలు ఉన్నట్లు సిఐ సత్యబాబు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.**

## ఈనెల 4,వ తేదీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ జిల్లాకు రాక

**అనంతపురం, ఆగస్టు 03 అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఈనెల 4వ తేదీన అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. సాజిదా బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఈనెల 4వ తేదీ మంగళవారం ఉదయం 10:30 గంటలకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగ సమావేశ మందిరంలో స్టాకింగ్ మరియు సైబర్ స్టాకింగ్ నివారణ, డిజిటల్ భద్రత, చట్టపరమైన హక్కులు, మరియు మహిళలు మరియు బాలికల భద్రత, సైబర్ నేరాలు నివారణ, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, వివిధశాఖల అధికారులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె తెలిపారు.

## ఎల్ నీనో ప్రభావం పై రైతులకు శిక్షణ




**నల్లచెరువు ఆగస్టు 3 అనంత జనశక్తి న్యూస్**

వ్యవసాయ పరిశోధన స్థానం కదిరి సిబ్బంది ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ బి వి భాస్కర్ రెడ్డి ఎం శ్రీనివాస చారి డి అనిత,నల్లచెరువు వ్యవసాయ అధికారి లక్ష్మీప్రియ ఓరువాయి రైతు సేవ కేంద్రంలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల్లో రైతులు అనుసరించాల్సిన శాస్త్రీయ సాగు విధానాలు డ్రైలాండ్ టెక్నాలజీలు వర్షాభావ పరిస్థితులలో పంటల సాగు నిర్వాహణ పద్ధతులను రైతులకు వివరించారు. పల్లెవాండ్లపల్లిలోని రైతుల పొలాల్లో వేరుశనగ పంటను పరిశీలించి అందులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచనలు మరియు సలహాలు అందజేశారు. బెట్ట పరిస్థితులలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతుంది కాబట్టి వాటి నివారణ పై శ్రద్ధ వహించాలి అని సూచించారు. బాగేపల్లి లో నరసింహారెడ్డి గారి పొలంలో వేరుశనగ ప్రస్తుతం 40 రోజుల పంట రసం పీల్చే పురుగుల ఉధృత్తి ఎక్కువగా గమనించడం జరిగినది నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.8 స్లీపింగ్ 60 మిల్లీ మందును 200 లీటర్లు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. వేరుశనగలో సెనగ పచ్చ పురుగు ఉధృతి గమనించగా నివారణకు ఇండాక్సా కార్బ్ 200 మిల్లీలీటర్ లేదా ఫ్లూ బెండమైడ్ 40 మిల్లి మందును 200 లీ. నీటికి కలిపి ఎకరాకి పిచికారి చేసుకోవాలి ఓరువాయిలో పియండిఎస్ పద్ధతిలో వేసిన రైతు పొలాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంటను వీక్షించారు.ఆగస్ట్, సెప్టెంబర్ లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయడం అవసరం.ఈ కార్యక్రమానికి ఓరువై అగ్రికల్చర్ అసిస్టెంట్ యుగంధర్, VRO నిర్మల, వెటర్నరీ అసిస్టెంట్ భవ్య,అందరు అగ్రికల్చర్ అసిస్టెంట్ లు మరియు రైతులు పాల్గొన్నారు.

## శ్యామ్ నందన్ ఆరోగ్య నిమిత్తం రూ.1,10,000 ను అందజేసిన విజన్ విద్యార్థులు

**- యాడికి పట్టణ వాసులు**

**యాడికి, ఆగష్టు 3, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న విజన్ విద్యార్థులు, యాడికి పట్టణ వాసులు శ్యామ్ నందన్ ఆరోగ్య నిమిత్తం రూ.1,10,000 లను సోమవారం అందచేశారు. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు పక్కనున్న కదిరగుట్టపల్లి గ్రామానికి చెందిన శ్యామ్ నందన్ అనే మూడు నెలల చిన్నారి స్పైనల్ మస్కిలర్ యాక్టివిటీ ఎస్ఎంఎ టైప్ 1,2,3,4 తో బాధపడుతున్న విషయం అందరికీ తెలిసిందే. అతడికి వచ్చిన జబ్బును నయం చేయడానికి ఒక ఇంజక్షన్ ధర రూ.17 కోట్లుగా డాక్టర్లు నిర్ణయించడంతో ఉద్యోగ రీత్యా సాఫ్ట్వేర్ ఇంజనీర్ అయిన తల్లిదండ్రులు నవీన్ కుమార్ కుటుంబ సభ్యులు ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు. వాళ్ల శక్తి మేరకు చూయించి అనేక చోట్ల తిరిగి క్రౌడ్ ఫండింగ్ ద్వారా ఇంజక్షన్ కు కావలసిన డబ్బును పోగు చేయడం కోసం యాడికి ని సందర్శించారు. యాడికి చెందిన విజన్ హైస్కూల్ విద్యార్థులు ,స్వచ్ఛంద సేవకులు సోషల్ మీడియా ఇన్ఫ్లుయర్స్ వీరందరూ కలిసి విద్యార్థులు తల్లిదండ్రుల సహకారంతో యాడికి పట్టణ వాసుల సహకారంతో అనేక చోట్ల తిరిగి ఈ ఫండ్ ను సేకరించారు. సేకరించిన ఒక లక్ష పదివేల రూపాయలను బాబు తండ్రిగారైన నవీన్ కుమార్ కు చెక్కు రూపంలో విద్యార్థుల సమక్షంలో అందించి బాబు ఆయురారోగ్యాలతో క్షేమంగా బయటపడాలని ఆకాంక్షించి, మొత్తం ను అందచేశారు.చిన్నారి తండ్రి నవీన్ కుమార్ మాట్లాడుతూ క్యాష్ రూ.110000 స్కానర్ ద్వారా దాదాపు యాడికి నుండి రూ. 90000 పైగా అనగా మొత్తం 2 లక్షల రూపాయలు పైగా యాడికి నుండి నిధులు సమకూరాయని సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా రుణపడి ఉంటామని తెలియజేశారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్క తల్లిదండ్రులకి ప్రతి ఒక్క పట్టణ వాసులు అందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్ ఉపాధ్యాయులు అమర్, శేఖర్, కోటి,ప్రసాద్ ,లియో క్లబ్ సంస్థ నుండి వెంకటరాముడు,తిరుమలేశ్, రాజబాబు, బాబు,శివ, యువ రాజ్, కుమార్, రాజశేఖర్, గిల్లి,కార్తీక్,వెంకటాద్రి అలాగే సోషల్ మీడియా ఇన్ఫ్లుయర్స్ నరసింహ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు
# ప్రభుత్వం పెద్దపీట



**- ఎమ్మెల్యే జారే**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో , ఆగస్టు 3 (అనంత జనశక్తి):**

రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాలు ఉద్యోగుల జీవితాల్లో భరోసా కల్పిస్తున్నాయని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాల చెల్లింపుతో పాటు రూ.1.5 కోట్ల వరకు ఉచిత ప్రమాద బీమా కవరేజీ కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన 'ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన అధ్యక్షతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించిన సంక్షేమ ప్రయోజనాలపై ప్రత్యేక అవగాహన సమావేశం, ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయ ఆవరణలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## గంజాయి రవాణా కేసులో
# ఇద్దరికి జైలు




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 3, (అనంత జనశక్తి న్యూస్)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సరిత ఇద్దరికీ 5 సంత్సరం ల జైలు శిక్ష, మరియు, 25 వేయిల రూపాయల చొప్పున ఇద్దరికి జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. బూర్గంపాడు నా ఎస్. ఐ. బి. బాలకృష్ణ భారత దేశ కర్ఫ్యూ పిలుపుమేరకు తన సిబ్బందితో పెట్రోలింగ్ చేయుచుండగా సారపాక బస్ స్టాప్ సెంటర్ రోడ్డు వద్ద 2020 మార్చ్ 22న హోండా స్కూటీపై ఇద్దరు వ్యక్తులు వచ్చుచుండగా వారిని తనిఖీ చేయగా 20 కిలోల గంజాయి దొరికగా వారు మహబూబాద్ జిల్లా మరిపెడ బంగ్లా కు చెందిన బీమనపల్లి శ్రీనివాసులు, రావీరాల లక్ష్మీనారాయణలు గా గుర్తించి బూర్గంపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఏఎస్ఐ. కే. సోమేశ్వరరావు కేసు నమోదు చేసుకోగా అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్లు పి.నవీన్ టీ.సత్యనారాయణలు దర్యాప్తు అనంతరం కోర్ట్ లో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడు గురి సాక్షులను విచారించిన అనంతరం శ్రీనివాసులు లక్ష్మీనారాయణ పై నేరము నిర్ధారించి, ఇదరికి 5 స. జైలు,చెరో 25 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పి.ఫణి కుమార్ నిర్వహించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ డి.రాఘవయ్య, కోర్ట్ లైజాన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రం కోర్టు డ్యూటీ ఆఫీసర్ పిసి అక్రమ్ లు సహకరించారు.

# ఆగస్టు 9 'చలో కొత్తగూడెం'

**- మహా ఆదివాసి సాంస్కృతిక ర్యాలీకి సీతక్క హాజరు**
**- ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు మంత్రి ఆహ్వానం**
**- ఆదివాసి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీలో పాల్గొంటా: సీతక్క**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 3, అనంత జనశక్తి న్యూస్ :**

**ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ ఆదివాసి మహా సాంస్కృతిక ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరు కావాలని తుడుందెబ్బ, ఆదివాసి సంఘాల ప్రతినిధులు రాష్ట్ర మంత్రి సీతక్కను సోమవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే "చలో కొత్తగూడెం" మహా సాంస్కృతిక ర్యాలీలో తాను అగ్రభాగాన పాల్గొంటానని తెలిపారు. తనతో పాటు ఆదివాసి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా ఈ ర్యాలీలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆదివాసి సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు కోడెం వెంకటేశ్వర్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తి రాజు, ఆదివాసి పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర, రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు పులుసం భద్రం, ఇల్లందు మండల అధ్యక్షులు గుమ్మడి రామ్‌కుమార్, కొత్తగూడెం డివిజన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ వాసం అంజిబాబు, పినపాక మండల నాయకులు పిట్టల సురేష్ తదితరులు పాల్గొన్నారు.**



# ప్రజావాణి వినతుల త్వరగతిన పరిష్కరించాలి



**- జిల్లా కలెక్టర్ అంకిత్**
**- ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 3, అనంత జనశక్తి న్యూస్**

సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్వో పద్మావతితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన అత్యంత కీలక వేదిక అని అన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం, సమర్థవంతమైన కార్యాచరణ ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి, ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని పేర్కొన్నారు. ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని సూచించారు.

**ప్రజావాణిలో స్వీకరించిన ముఖ్య వినతులు**

పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామం: శిథిలావస్థకు చేరుకున్న పాత ప్రాథమిక పాఠశాల భవనాన్ని తొలగించి, కొత్త పాఠశాల భవనానికి ప్రహరీ గోడతో పాటు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారికి కలెక్టర్ ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామం: కురుమబజార్ కాలనీలో చేతి పంపు పని చేయక తాగునీటి సమస్య నెలకొన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. సంబంధిత ఎంపీడీవోకు కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అన్నపురెడ్డిపల్లి బాలాజీనగర్ కాలనీ: 132/33 కేవీ విద్యుత్ లైన్‌ను కాలనీ మధ్యలో కాకుండా గ్రామ శివారు నుంచి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈ విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఈఈకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. గుండాల మండలం కొడవటంచ గ్రామం: వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల ఒడ్డు భూమికి పట్టా మంజూరు చేయాలని బొమ్మల లాలు ప్రసాద్ సమర్పించిన వినతిని పరిశీలించిన కలెక్టర్, తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
# ఘనంగా నిర్వహించాలి

**- కలెక్టర్ అంకిత్**
**- సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి**
**- ప్రగతి మైదానంలో స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 3, (అనంత జనశక్తి):**



కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సన్నాహక సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రగతి మైదానంలో ప్రధాన వేదికను ఆకర్షణీయంగా రూపొందించి, ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమర యోధులు, అధికారులు, విశిష్ట అతిథులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలకు ప్రోటోకాల్‌కు అనుగుణంగా ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, బ్యారికేడ్లు, పార్కింగ్, సూచిక బోర్డులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్లు తదితర సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వాటర్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సౌండ్ సిస్టమ్, మైకులు, లైటింగ్, ఎల్ఈడీ స్క్రీన్లను ముందస్తుగా పరీక్షించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. వేడుకల ప్రాంగణంలో 108 అంబులెన్స్, వైద్య బృందాలు, ప్రథమ చికిత్స కేంద్రం, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని ఆరోగ్య శాఖకు సూచించారు. అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని, పోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా అత్యంత గౌరవప్రదంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, అటవీ, వైద్యం, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, ఆర్టీసీ తదితర శాఖలు తమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులతో దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, నాటికలు నిర్వహించి జాతీయ భావనను పెంపొందించాలని, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను ప్రతిబింబించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం కోసం శాఖల వారీగా వివరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్వో పద్మావతి, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా పారదర్శకంగా పూర్తి చేయాలి

**- సి. సుదర్శన్ రెడ్డి**
**- ఓటర్ల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి**
**- ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు: కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 3, అనంత జనశక్తి న్యూస్ :**




ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఐడీఓసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. డూప్లికేట్ ఎంట్రీలు, ఫోటో మిస్‌మ్యాచ్‌లు, ఏఎస్‌డీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి సరిచేయాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో అవసరమైన అన్ని వివరాలు నమోదు చేయడంతో పాటు బీఎల్‌వోల సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారు, గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి ధృవీకరించి బీఎల్ఏల ద్వారా నిర్ధారణ చేయాలని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను పకడ్బందీగా నిర్వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేసి ఒక్క అర్హుడూ మిగిలిపోకుండా చూడాలని, వీవీఐపీ, వీఐపీ ఓటర్ల మ్యాపింగ్‌ను సహాయ ఎన్నికల నమోదు అధికారులు స్వయంగా పరిశీలించి ధృవీకరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలని, డూప్లికేట్ ఎంట్రీలు, ఫోటో మిస్‌మ్యాచ్‌లు, ఏఎస్‌డీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి సరిచేయాలని ఆదేశించారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారు, గుర్తించలేని ఓటర్ల వివరాలను బీఎల్‌వోలు, బీఎల్ఏల సమన్వయంతో ధృవీకరించి జాబితాలను నవీకరించాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేసి వంద శాతం నమోదు లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 95 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో
# ఎక్స్‌పైరీ సెలైన్ కలకలం


**- గడువు తీరిన సెలైన్ రోగులకు ఎక్కించారంటూ ఆరోపణలు**
**- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రోగుల బంధువుల డిమాండ్**

**మణుగూరు, ఆగస్టు 3, (అనంత జనశక్తి న్యూస్ ):**

మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గడువు తీరిన (ఎక్స్‌పైరీ) సెలైన్ బాటిళ్లను రోగులకు ఎక్కించారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. నిత్యం వందలాది మంది ప్రజలు వైద్య సేవలు పొందుతున్న ఈ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈ ఘటన రోగులు, వారి కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొన్నదని రోగుల బంధువులు ఆరోపిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... ఇటీవల వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న పాత మణుగూరు, రాజుపేటతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు రోగులు చికిత్స కోసం మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. వీరిలో ఐదుగురికి పైగా రోగులకు గడువు తీరిన సెలైన్ బాటిళ్లను ఎక్కించారని బంధువులు ఆరోపిస్తున్నారు. సెలైన్ బాటిళ్లపై ముద్రించిన గడువు తేదీ ముగిసిన విషయాన్ని గుర్తించిన అనంతరం రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య చికిత్సలో ఉపయోగించే మందులు, సెలైన్ బాటిళ్ల గడువు తేదీలను పరిశీలించడం అత్యంత ప్రాథమిక బాధ్యత అయినప్పటికీ, వాటిని నిర్లక్ష్యంగా వినియోగించడం వల్ల రోగుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన వైద్య సామగ్రిని వినియోగించడం వైద్య నిబంధనలకు విరుద్ధమని, ఇటువంటి నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించరాదని వారు పేర్కొంటున్నారు. ఆసుపత్రిలో కొంతమంది నర్సులు, ఏఎన్ఎంలు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, చికిత్స కోసం వచ్చిన వారిని సక్రమంగా పట్టించుకోవడం లేదని కూడా రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. రోగులతో అమర్యాదగా ప్రవర్తించడం, వైద్య సేవల్లో జాప్యం చేయడం వంటి అంశాలపై కూడా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు పేద, మధ్యతరగతి ప్రజలే అధికంగా వస్తుంటారని, అలాంటి చోట వైద్య సేవల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని, నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. అలాగే, గడువు తీరిన సెలైన్ బాటిళ్లు ఎలా వినియోగంలోకి వచ్చాయి? వాటిని ఎవరు పరిశీలించకుండా రోగులకు ఎక్కించారు? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, సెలైన్ బాటిళ్ల గడువు తేదీలను కచ్చితంగా తనిఖీ చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



# సమోసాలు, జిలేబీలకు ఇక హెల్త్ వార్నింగ్‌లు: సిగరెట్ల తరహాలో కొత్త నిబంధనలు



దేశంలో పెరుగుతున్న ఊబకాయం సమస్యను అరికట్టేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సమోసాలు, జిలేబీలు వంటి డీప్-ఫ్రైడ్ స్నాక్స్‌లో కొవ్వు, చక్కెర స్థాయిని తెలిపేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య సంస్థలను ఆదేశించింది. నాగ్‌పూర్‌లోని ఎయిమ్స్ సహా దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ఆరోగ్య సంస్థలకు ఒక ఆదేశం జారీ అయినట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా ఒక కథనం ప్రచురించింది. క్యాంటీన్లు, బహిరంగ ప్రదేశాల్లో ఆకర్షణీయమైన "నూనె, చక్కెర బోర్డులు" ఏర్పాటు చేయాలని ఈ ఆదేశంలో పేర్కొన్నారు. ఈ సమాచార పోస్టర్లు సాధారణ ప్రజలు ఎక్కువగా తినే ఆహార పదార్థాలలో ఉండే కొవ్వు, చక్కెర స్థాయిలను స్పష్టంగా తెలియజేస్తాయి. ఇది సిగరెట్లపై ఉండే ఆరోగ్య హెచ్చరికల మాదిరిగానే ప్రజలను హెచ్చరిస్తుంది. అధిక కేలరీలు, నూనెలో బాగా వేయించిన, చక్కెర అధికంగా ఉండే జిలేబీలు, సమోసాలు వంటి ఆహార పదార్థాలను అధికారికంగా ఆరోగ్య హెచ్చరికల జాబితాలో చేర్చినట్లు ఆ నివేదిక తెలిపింది.



**ఈ నిర్ణయం ఎందుకు?**

భారతదేశంలో జీవనశైలి వ్యాధులు ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకుంది. ఊబకాయం, మధుమేహం , రక్తపోటు , గుండె జబ్బులకు చక్కెర, ట్రాన్స్ ఫ్యాట్స్ ప్రధాన కారణాలని ఆరోగ్య నిపుణులు ఎప్పటి నుంచో హెచ్చరిస్తున్నారు. 2050 నాటికి 449 మిలియన్ల మంది భారతీయులు అధిక బరువుతో లేదా ఊబకాయంతో బాధపడే అవకాశం ఉందని అంచనాలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రపంచంలోనే ఊబకాయానికి రెండో అతిపెద్ద కేంద్రంగా భారతదేశం మారే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

**ఇది నిషేధం కాదు, అవగాహన కోసమే!**

అయితే, సమోసాలు, జిలేబీలను ప్రభుత్వం నిషేధించడం లేదని స్పష్టం చేసింది. ఈ ప్రచారం ప్రజలకు సరైన సమాచారం అందించడానికే ఉద్దేశించబడింది తప్ప, సాంప్రదాయ స్నాక్స్ వినియోగాన్ని చట్టవిరుద్ధం చేయడం కాదని అధికారులు తెలిపారు. ఈ చొరవ ప్రధానమంత్రి మోడీ చేపట్టిన "ఫిట్ ఇండియా" ఉద్యమానికి తోడ్పడుతుంది. నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఈ ఉద్యమం ప్రజలను కోరుతోంది. ఈ కొత్త హెచ్చరికలు ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంచి, మెరుగైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.







# శారీరక శ్రమతో ఆయుష్షు పెరుగుదల: తాజా అధ్యయనంలో కీలక విషయాలు





శారీరక శ్రమ మన ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో చెప్పాల్సిన పనిలేదు. అయితే, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల అకాల మరణాల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. వారానికి 150 నుండి 300 నిమిషాల మధ్యస్థ తీవ్రత కలిగిన వ్యాయామం ఏదైనా కారణంతో సంభవించే మరణాల ప్రమాదాన్ని తగ్గిస్తుందని ఈ అధ్యయనం కనుగొంది. పెద్దవారిలో శారీరక శ్రమ అనారోగ్యాన్ని నివారిస్తుందని ఈ పరిశోధన తేటతెల్లం చేసింది.

క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన రూయీూ యు, డాక్టర్ గ్రెగోర్ ఐ. మీల్కే నేతృత్వంలో జరిగిన ఈ అధ్యయనం శారీరక శ్రమ ఆవశ్యకతను నొక్కి చెబుతూ బలమైన ఆధారాలను అందించింది. బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం, శారీరక శ్రమను నిరంతరం కొనసాగించే లేదా కాలక్రమేణా దాన్ని పెంచుకునే పెద్దవారికి మరణాల ప్రమాదం 20 నుండి 40 శాతం వరకు తక్కువగా ఉంది. అంతేకాకుండా, వ్యాయామం చేయనివారితో పోలిస్తే, చురుకుగా ఉండే పెద్దవారికి గుండె సంబంధిత సమస్యల వల్ల మరణించే ప్రమాదం కూడా తక్కువగా ఉందని ఈ అధ్యయనం వెల్లడించింది.

**అధ్యయన ప్రధానాంశాలు**

ఈ అధ్యయనం ఎనిమిది ప్రధాన వైద్య డేటాబేస్‌లను పరిశీలించడం ద్వారా సంబంధిత మునుపటి అధ్యయనాలను విశ్లేషించింది. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది పాల్గొన్న 85 అధ్యయనాలను విశ్లేషణ కోసం ఎంపిక



చేశారు.

వ్యాయామ అలవాట్ల గురించి ప్రజలను నేరుగా అడగకుండా, ఈ అధ్యయనం వివిధ సమయ విభాగాలలో ప్రజల వ్యాయామ విధానాలను పర్యవేక్షించింది. పాల్గొన్నవారిని నాలుగు విభాగాలుగా విభజించారు. నిరంతరం చురుకుగా ఉన్నవారు శారీరక శ్రమను పెంచుకున్నవారు శారీరక శ్రమను తగ్గించుకున్నవారు



కదలిక లేని జీవనశైలిని అనుసరించినవారు ఈ ఫలితాలు చాలా ఆశ్చర్యకరంగా ఉన్నాయి. నిరంతరం చురుకుగా ఉన్నవారికి ఏదైనా కారణంతో సంభవించే మరణాల ప్రమాదం 29% తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. తీరిక సమయాల్లో శారీరక శ్రమలో పాల్గొన్నవారిలో మరణాల ప్రమాదం 39% వరకు తగ్గింది. శారీరక శ్రమను పెంచుకున్నవారిలో మరణాల ప్రమాదం 22 నుండి 27 శాతం వరకు తక్కువగా ఉంది.

**ఎంత వ్యాయామం సరిపోతుంది?**

మరణాల ప్రమాదాన్ని తగ్గించడానికి ఎంత వ్యాయామం అవసరమో కూడా ఈ అధ్యయనం పరిశీలించింది. ప్రాథమిక వ్యాయామ మార్గదర్శకాలను పాటించినవారికి.. అంటే వారానికి 150 నుండి 300 నిమిషాల మధ్యస్థాయి తీవ్రత కలిగిన వ్యాయామం చేసినవారికి మరణాల ప్రమాదంలో గణనీయమైన తగ్గింపు కనిపించింది.





# గ్లామర్‌ని కాదు... నటనని ఆస్వాదించాలి

"గ్లామర్ నేను చేసే పనిలో ఒక భాగం మాత్రమే కానీ, ప్రేక్షకులు ఎల్లప్పుడూ నా నటనని ఆస్వాదించాలనే కోరుకుంటాన"ని అంటోంది బాలీవుడ్ హీరోయిన్ దిశా పటానీ. త్వరలోనే హాలీవుడ్ సినిమా 'హోలీగార్డ్స్ సాగా- ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్'లో జెస్సికా పాత్రతో సినీ ప్రియుల్ని పలకరించనుందీ తార. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఈ సినిమా ప్రయాణంలో కెరీర్ గురించి తెలుసుకున్న పలు ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "సహజంగానే హాలీవుడ్ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆడిషన్ అవకాశం వచ్చింది. ఇతర ప్రాజెక్టుల్లా ఇది ఎక్కడి నుంచి వస్తోంది, ఎలా ముగుస్తుంది అనే దాని గురించి ఆలోచించకుండా బాగా నటించడంపైనే దృష్టి పెట్టాను. కొత్తగా ఏదైనా ప్రారంభించినప్పుడు ఒత్తిడి సహజం. కానీ, నేను దాన్ని అస్సలు పట్టించుకోను. కేవలం పని చేసే అనుభవాన్ని ఆస్వాదిస్తూ ఆ క్రమంలో వీలైనంత నేర్చుకోవాలని అనుకుంటాను. ఈ సినిమా ప్రయాణంలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం, పూర్తిగా భిన్నమైన సినీ నిర్మాణ వాతావరణంలో పనిచేయడం నన్నెంతగానో ఉత్తేజపరిచింది. అలా నన్ను నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు నెట్టింది. అందుకే నాలోని విభిన్నమైన భావోద్వేగాలు, కోణాలను అన్వేషించడానికి వీలు కల్పించే పాత్రలను ఎంచుకోవాలని ప్రయత్నిస్తున్నా" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం హిందీ చిత్రం 'ఆవారాపన్ 2'తో బిజీగా ఉంది దిశ.

# ఈ సారి ప్రేమ కథతో



ఈ మధ్యే 'ఆల్ఫా' చిత్రంతో తనలోని యాక్షన్ కోణాన్ని ప్రేక్షకులకు రుచి చూపించింది బాలీవుడ్ కథానాయిక శార్వరీ వాఘ్. ఇప్పుడామె ప్రేమికురాలిగా సినీప్రియుల్ని అలరించడానికి సిద్ధమవుతోంది. ఆమె, హీరో ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'యే ప్రేమ్ మోల్ లియా'. సూరజ్ బర్జాత్యా దర్శకత్వం వహిస్తున్నారు. రాజశ్రీ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. చిత్ర షూటింగ్‌ను పూర్తి చేసినట్లు తెలుపుతూ.. ఇటీవల సామాజిక మాధ్యమాల వేదికగా కొన్ని ఫొటోలను పంచుకున్నారు ఆయుష్మాన్. "ఈ ప్రయాణాన్ని ఇంత ప్రత్యేకంగా చేసినందుకు చిత్రబృందంతో పాటు.. దర్శకుడికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు. ఈ ప్రేమకథను మీ ముందుకు తీసుకురావడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నామ"ని ఓ పోస్ట్‌లో పేర్కొన్నారు. దీన్ని నవంబరు 27న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు వెల్లడించింది చిత్రబృందం.

# ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న వైష్ణవి చైతన్య.. బోనం సమర్పించి ప్రత్యేక పూజలు

తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు హైదరాబాద్ నగరంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని ప్రముఖ టాలీవుడ్ నటి వైష్ణవి చైతన్య సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి విచ్చేసిన ఆమె, శిరస్సుపై బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించడం అక్కడికి వచ్చిన భక్తులను ఆకట్టుకుంది. ఆలయానికి చేరుకున్న వైష్ణవి చైతన్యకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్న వైష్ణవి కొంతసేపు ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వైష్ణవి చైతన్య.. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని, మానసిక ప్రశాంతతను ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అలాగే తన కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. వైష్ణవి చైతన్య బోనాల వేడుకల్లో పాల్గొన్న ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సంప్రదాయ చీరలో, అచ్చ తెలుగు అమ్మాయిలా కనిపించిన ఆమె లుక్‌కు అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. సినీ రంగంలో బిజీగా ఉన్నప్పటికీ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం అభినందనీయమని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'బేబీ' సినిమాతో యువతలో విశేషమైన గుర్తింపు తెచ్చుకున్న వైష్ణవి చైతన్య ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. షూటింగ్‌ల మధ్య సమయం కేటాయించి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడం ఆమె భక్తిని, సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెలంగాణలో ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే బోనాల మహోత్సవాలకు సినీ, రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా పలువురు ప్రముఖులతో పాటు వైష్ణవి చైతన్య పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



# ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే

నటి అనుపమ పరమేశ్వరన్ భావోద్వేగానికి లోనయ్యారు. గడచిన ఏడాదికాలం తన జీవితం ఎంతో కష్టంగా గడిచిందని, ఒకానొక దశలో మానసికంగా కృంగిపోయానని అనుపమ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తమిళ నటుడు ధృవ్‌విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్టు, వారి ప్రేమకు బ్రేకప్ అయినట్టు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. తాజాగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడింది ఆ విషయం పైనేనంటూ సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. ఇంకా చెబుతూ 'ఎంత కష్టపడితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుంది. ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే. ఇన్నాళ్లూ ఇతరుల కోసం బతికా. నా జీవితం కూడా నా చేతుల్లో లేదు. ఇప్పుడు నాకోసం నేను బతుకుతున్నా. నా జీవితాన్ని నా నియంత్రణలోకి తీసుకున్నా. గతాన్ని వదిలి ధైర్యంగా ముందుకు సాగుతున్నా. ఈ సందర్భంగా కొంతమందికి ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. వ్యక్తిగత జీవితంలోని ప్రతి విషయాన్నీ అందరికీ చెప్పాల్సిన అవసరం లేదు' అంటూ అనుపమ ఘాటుగా స్పందించింది. మరి ఈ వ్యాఖ్యల్లో అంతర్యం ఏమిటో అనుపమకే తెలియాలి.

# అర్‌ష్‌దీప్ టాప్-5 బౌలర్లలో బుమ్రా మిస్.. ఎవరెవరికి ఛాన్స్ దక్కిందంటే?




ఇంగ్లాండ్ పర్యటన తర్వాత స్వదేశానికి తిరిగొచ్చిన టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ అర్‌ష్‌దీప్ సింగ్ ప్రస్తుతం ఆటకు దూరంగా ఉన్నాడు. ఈ క్రమంలో తాజాగా క్రిషాంక్ ఆత్రే అనే పాడ్‌కాస్టర్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా అతను అనేక విషయాలను పంచుకున్నాడు. భారత క్రికెట్‌లో టాప్-5 బౌలర్లు ఎవరో చెప్పాలని అర్‌ష్‌దీప్‌ను క్రిషాంక్ ఆత్రే కోరాడు. అయితే, అర్‌ష్‌దీప్ తన జాబితాలో ఇద్దరు పేసర్లకు మాత్రమే అవకాశమివ్వగా.. అందులో స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా పేరు లేకపోవడం గమనార్హం. వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు అర్‌ష్‌దీప్ అగ్రస్థానం కల్పించాడు. "భువీ భాయ్ అంటే వ్యక్తిగతంగా నాకెంతో ఇష్టం. కాబట్టి.. అతణ్ని టాప్ బౌలర్‌గా ఎంచుకున్నా. ఇక రెండో స్థానంలో మహ్మద్ షమీ భాయ్‌కి చోటిస్తా. ఎలాంటి వికెట్ మీదనైనా సీమ్ రాబట్టగల సత్తా అతడికి ఉంది. అద్భుతంగా బౌలింగ్ చేస్తాడు. మూడో స్థానంలో కుల్‌దీప్ యాదవ్ ఉంటాడు. ఎడమచేతివాటం చైనామన్ బౌలర్ అయిన అతనికి అరుదైన బౌలింగ్ నైపుణ్యాలున్నాయి. తర్వాత స్థానంలో యుజ్వేంద్ర చాహల్ ఉంటాడు. చాహల్ పంజాబ్ జట్టులో నాకు సహచరుడు. ఐపీఎల్‌లో అతనికి అద్భుతమైన రికార్డు ఉంది. అశ్విన్ భాయ్‌ని ఈ జాబితాలో చివర్లో పెట్టాలనుకోలేదు. కానీ, టాప్-5లో చోటు లేకపోవడంతో తప్పడం లేదు. అశూ భాయ్ దిగ్గజ క్రికెటర్. ఐపీఎల్‌లో నా మొదటి కెప్టెన్ అతనే. సారీ భాయ్.. పర్సనల్‌గా నేను నీకు మెసేజ్ చేస్తాను" అని అర్‌ష్‌దీప్ పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో అర్‌ష్‌దీప్ భారత క్రికెట్‌లో ఆల్‌టైమ్ ప్లేయింగ్ ఎలెవన్‌ను కూడా ఎంచుకున్నాడు. ఈ జాబితాలో అర్‌ష్‌దీప్ సింగ్ తనతోపాటు బుమ్రా కు కూడా చోటు కల్పించడం విశేషం. ఓపెనర్లుగా సచిన్, గంభీర్.. తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌లో రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్, రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీలను ఎంచుకున్నాడు. స్పిన్నర్‌గా హర్భజన్ సింగ్‌కు అవకాశమిచ్చాడు. ప్రధాన పేసర్‌గా జహీర్ ఖాన్‌కు చోటు కల్పించాడు.

# దులీప్ ట్రోఫీకి నార్త్ జోన్ జట్టు ప్రకటన.. అభిషేక్‌కు నో ఛాన్స్

దులీప్ ట్రోఫీ ఆగస్టు 23 నుంచి ప్రారంభంకానుంది. ఈ టోర్నమెంట్ కోసం సోమవారం నార్త్ జోన్ జట్టును ప్రకటించారు. జమ్మూకశ్మీర్ స్టార్ కన్హయ్య వాధ్వాన్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయగా.. ఢిల్లీ ఆటగాడు ఆయుష్ బదోనిని వైస్ కెప్టెన్‌గా నియమించారు. టీమ్‌ఇండియా బౌలర్లు అర్‌ష్‌దీప్ సింగ్, అంశుల్ కాంబోజ్‌కు ఈ జట్టుకు ఎంపికయ్యారు. అయితే, పంజాబ్ స్టార్ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లకు అవకాశం కల్పించలేదు. ఈ టోర్నీ జరుగుతున్న సమయంలోనే శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో శుభ్‌మన్ గిల్, అకిబ్ నబీ ఆడనున్నారు. దీంతో వీరిద్దరిని దులీప్ ట్రోఫీ జట్టుకు ఎంపిక చేయలేదు. కొత్తగా నార్త్ జోన్ కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న 24 ఏళ్ల కన్హయ్య వాధ్వాన్ జమ్మూకశ్మీర్ 2025-26 రంజీ ట్రోఫీ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. 13 ఇన్నింగ్స్‌ల్లో 474 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ కూడా ఉంది. ఫైనల్‌లో హాఫ్ సెంచరీతో మెరిశాడు. దులీప్ ట్రోఫీ నార్త్ జోన్ జట్టు: సనత్ సాంగ్వాన్, కమ్రాన్ ఇక్బాల్, యశ్ ధుల్, ఆయుష్ దోసెజా, అబ్దుల్ సమద్, ఆయుష్ బదోని (వైస్ కెప్టెన్), కన్హయ్య వాధ్వాన్ (కెప్టెన్), నిశాంత్ సింధు, అర్జున్ శర్మ, అబిద్ ముస్తాక్, అర్‌ష్‌దీప్ సింగ్, సునీల్ కుమార్, అంశుల్ కాంబోజ్, యుధ్వీర్ సింగ్, నిఖిల్ కశ్యప్.

# ఆటగాళ్లకు ఫిట్‌నెస్ సమస్యలు.. చీఫ్ ఫిజియోపైనా బీసీసీఐ నజర్!



యూకే పర్యటనలో వరుస ఓటముల కారణంగా భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బృందంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే ఇప్పటికే జట్టును వీడిన సంగతి తెలిసిందే. గత కొన్నాళ్లుగా ఫీల్డింగ్ దారుణంగా ఉండటంతో భారత జట్టుకు కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను బీసీసీఐ నియమించింది. ఇప్పుడు చీఫ్ ఫిజియో కమ్లేశ్ జైన్ పైనా బోర్డు దృష్టి సారించినట్లు వార్తలు వస్తున్నాయి. శ్రీలంకతో సిరీస్ అనంతరం ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

**ఇదేనా కారణం..?**

నితిన్ పటేల్ స్థానంలో 2022లో కమ్లేశ్ చీఫ్ ఫిజియోగా బాధ్యతలు స్వీకరించారు. అయితే, గత కొద్ది నెలలుగా భారత ఆటగాళ్లు ఎక్కువగా గాయాలపాలు కావడం పెద్ద చర్చకు దారితీసింది. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్ గాయంతో జట్టుకు దూరమయ్యారు. తాజాగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా లంకతో టెస్టు సిరీస్ నుంచి వైదొలిగాడు. అంతకుముందు ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో కెప్టెన్ గిల్, గుర్నూర్ బ్రార్ కండరాలు పట్టేయడంతో ఇబ్బంది పడటం చూశాం. ప్లేయర్ల గాయాల విషయంలో చీఫ్ ఫిజియోగా కమ్లేశ్ పనితీరుపై ప్రధాన కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ సమస్యలతో అత్యుత్తమ టీమ్‌ను బరిలోకి దింపలేకపోతున్నట్లు అసహనం వ్యక్తం చేసినట్లూ వార్తలు వచ్చాయి.

**సీవోఈపైనా ప్రశ్నలు**

చీఫ్ ఫిజియో కమ్లేశ్ జైన్‌తోపాటు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(COE) పనితీరుపైనా అనుమానాలు వస్తున్నాయి. బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసైనట్లు తొలుత సీవోఈ ప్రకటన చేసింది. తీరా, ఒక్క రోజు వ్యవధిలోనే అతడి గాయం ఇంకా మానలేదని.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో ఆడటం లేదని వెల్లడించింది. ఇక్కడా మేనేజ్‌మెంట్ సరిగా లేదనే విమర్శలు వస్తున్నాయి. స్క్వాడ్‌లోకి రావాలంటే తీవ్ర పోటీ ఉన్న ఇలాంటి సమయంలో గాయాల వల్ల కెరీర్‌లు డోలాయమానంలో పడే ప్రమాదం ఉందనేది కొందరి వాదన. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా విషయంలోనూ ఇలాంటి తప్పిదాలే జరిగాయి. దీంతో శ్రీలంకతో టెస్టు సిరీస్ అనంతరం కోచింగ్ బృందంతోపాటు ఫిజియో, టీమ్ డాక్టర్ స్థానాల్లోనూ కొత్తవారు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం టీమ్ డాక్టర్‌గా రిజ్వాన్ ఖాన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945